సోమవారం
07-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 47
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

ఇజ్రాయిల్‌లో ఆగని ప్రజానిరసనలు

ఇజ్రాయిల్‌లో ప్రజానిరసన ఆగడం లేదు. నెతన్యాహు ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా ఆందోళనలు 31వ వారానికి చేరుకున్నాయి. లక్ష మందికిపైగా టెల్ అవీవ్ వీధుల్లోకి వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు.

2 లో

మైనారిటీలపై వివక్ష, బలవంతపు వలసలు

- హింసను రెచ్చగొడుతున్నది బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్
- కలచివేసిన క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు
- గురుగ్రామ్, నూహ్‌లో సీపీఐ నాయకుల పర్యటన

నూహ్: మతసామరస్యం అనేది విద్వేష-విభజన రాజకీయాలకు బలిపశువుగా మారిందని హింస బాధిత హరియాణాలోని నూహ్, గురుగ్రామ్ ప్రాంతాల్లో పర్యటించిన సీపీఐ నాయకులు అన్నారు. స్థానికంగా సంస్థాగతంగా విద్వేషాన్ని, విభజనలను వృద్ధి చేస్తున్న తీరు తమను షాక్‌కు గురిచేసిందని చెప్పారు. హింసాకాండ ఘటనలపై సమగ్ర విచారణ, బాధితులకు సముచిత నష్ట పరిహారం, నూహ్, గురుగ్రామ్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు హామీనివ్వాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ ఎంపీలు వినయ్ విశ్వం, సంతోశ్ కుమార్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్, సీపీఐ హరియాణా కార్యదర్శి దరియావో సింగ్ కశ్యప్ డిమాండ్ చేశారు. ముస్లింలు కనిపిస్తేనే హింస జరుగుతుందని, వారికి ఆ ప్రాంతంలో వ్యాపారాల చేయనివ్వద్దు అని పోలీసు అధికారులకు స్థానిక సర్పంచ్ సూచనలు చేయడం దారుణమని నాయకులు అన్నారు. మైనారిటీలను బలవంతంగా అక్కడ నుంచి వెళ్లిపోయేలా చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. విస్తుపోయే వాస్తవాలను తెలుసుకున్నామని తమ పర్యటనపై విడుదల చేసిన ప్రకటనలో నాయకులు తెలిపారు. హింస బాధిత గురుగ్రామ్, నూహ్ జిల్లాలో కావాలనే హింసను రెచ్చగొడుతున్నారని, క్షేత్రస్థాయి పరిస్థితులు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని నాయకులు తెలిపారు. రెవారీ జిల్లా, జైనాబాద్ పంచాయతీ సర్పంచ్ స్థానిక పోలీసు అధికారులకు రాసిన అధికారిక లేఖ తమ చేతికి అందిందని, అందులోని విషయాలను బట్టి బీజేపీ పాలనలో మైనారిటీలపై సంస్థాగత వివక్ష ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చన్నారు. పంచాయతీ పరిధిలో ముస్లింలను వ్యాపారాలు

- మిగతా 2 లో

గద్దర్ కన్నుమూత

- అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస
- 1969 తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర
- ఆటపాటలతో ఉత్సాహం నింపిన ప్రజా యుద్ధనౌక
- ప్రజా గాయకుడి భౌతికకాయానికి ప్రముఖుల నివాళులు
- నేడు అంత్యక్రియలు



విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజా యుద్ధ నౌక, ప్రజా గాయకుడు గద్దర్ అలియాస్ గుమ్మడి విఠల్‌రావు (74) తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఆయన మరణించినట్లు కుమారుడు సూర్యం వెల్లడించారు. గద్దర్ తీవ్రమైన గుండె వ్యాధితో జులై 20న ఆస్పత్రిలో చేరారు. ఆగస్టు 3న ఆయనకు బైపాస్ సర్జరీ చేశారు. ఆ వ్యాధి నుంచి కోలుకున్నప్పటికీ ఊపిరితిత్తుల సమస్య రావడంతో మరణించారు. గతంలో కూడా ఊపిరితిత్తుల సమస్యతోనే ఆయన ఇబ్బంది పడ్డారు. ఊపిరితిత్తులు, మూత్ర సమస్యలు, వయసు సంబంధిత కారణాలతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గద్దర్ కన్నుమూశారని అపోలో వైద్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు కుటుంబీకులు కూడా ప్రకటన చేశారు. ఆదివారం ఉదయం బీపీ పెరగడంతో పాటు షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పడిపోయాయి. మధ్యాహ్నం మల్టిపుల్ ఆర్గాన్స్ దెబ్బతిన్నాయని గద్దర్ కుటుంబీకులు మీడియాకు వెల్లడించారు. గద్దర్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎల్‌బీ స్టేడియం నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుంది.

ప్రజాయుద్ధ నౌకగా పేరు తెచ్చుకున్న గద్దర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మెదక్ జిల్లాలోని తూప్రాన్ గ్రామంలో గద్దర్ దళిత కుటుంబంలో జన్మించారు. తల్లి పేరు లచ్చుమ్మ, తండ్రి పేరు శేషయ్య. నిజామాబాద్ జిల్లా మహబూబ్‌నగర్‌లో చదువుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చురుగ్గా

- మిగతా 2 లో

దసరా నాటికి విశాఖ నుంచి పాలన!

సీఎం జగన్ బసకు చాపకింద నీరులా ఏర్పాట్లు?

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: ఈ మధ్యకాలంలో మూడు రాజధానుల మాట మరుగున పడినప్పటికీ... విశాఖ నుంచి పాలన సాగించే అంశంపై మళ్లీ ఊహాగానాలు జోరందుకున్నాయి. సెప్టెంబరు నుంచే విశాఖకు కాపురం మారుస్తానంటూ సీఎం జగన్ గతంలో ప్రకటన చేయగా, తాజాగా వైసీపీ నేతలు దసరా (అక్టోబరు 24)నాటికి విశాఖకు సీఎం జగన్ వచ్చేస్తారంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖపట్నం నుంచి పాలన సాగించేందుకు చాప కింద నీరులా ఏర్పాట్లు సాగుతున్నాయి. విశాఖలో సీఎం కార్యాలయం, నివాసాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను తాజాగా పోలీసు ఇంటిలిజెన్స్ విభాగం సమీక్షించినట్టు తెలుస్తోంది. రుషికొండలో పర్యాటక శాఖ కొత్తగా నిర్మించిన భవనాల్లో ముఖ్యమంత్రి కార్యాలయం, అక్కడికి సమీపంలోనే

- మిగతా 2 లో

రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి

- ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 8 వరకు 26 జిల్లాల్లో సీపీఐ బస్సు యాత్ర
- జగన్ ఇక్కడున్నా, విశాఖలో ఉన్నా గుండు సున్నానే...
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 8 వరకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో సీపీఐ బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. విజయవాడ దాసరి భవన్‌లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ బస్సు యాత్ర ఈ నెల 17న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వద్ద ప్రారంభమై సెప్టెంబరు 8న తిరుపతిలో భారీ ప్రదర్శన, బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. ఈ బస్సు యాత్ర కార్యక్రమాలలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కేంద్ర నాయకులు వినయ్ విశ్వం, అమరజిత్ కౌర్, కె.నారాయణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, తిరోగమన విధానాలపై ప్రజలను చైతన్యం చేయటానికి ఈ యాత్ర చేపట్టినట్లు వివరించారు. ఈ బస్సు యాత్ర సందర్భంగా జిల్లాలలో జరిగే ర్యాలీలు, సభలు, సమావేశాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీ అప్పుల బారిన పడలేదని ప్రకటిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు, ఆర్థిక వేత్తలు ఏపీ ఆర్థికంగా దివాళా తీసిందంటున్నారన్నారు. ఇప్పటికి దాదాపు రూ.9 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని, మరికొన్ని నెలల్లో ఏపీ అప్పు రూ.10 లక్షల కోట్లుకు చేరుకుంటుందని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఏపీ అప్పుల పాలైయిందని చెప్పటం, వైసీపీ నాయకులు నాలుగు నెలల్లో రూ.33,500 కోట్లు అప్పు చేసినట్లు చెప్పారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర బీజేపీ నేతల మాటలు పరస్పర విరుద్ధంగా ఉండడంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఈ అప్పుల వ్యవహారంపై రాష్ట్ర ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రిగాని ప్రజలకు సమాధానం చెప్పాలని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన అన్నిరకాల అప్పులపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా జరగటం

- మిగతా 2 లో

ఈహెచ్‌ఎస్ అరకొర

- బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం
- వైద్యమందించడానికి నెట్‌వర్క్ ఆస్పత్రుల నిరాకరణ

2 లో

అమెరికాలో మళ్లీ కాల్పులు

ముగ్గురి మృతి, ఇద్దరికి గాయాలు

వాషింగ్టన్: అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన చోటుచేసుకుంది. వాషింగ్టన్‌లోని అనకోస్టియా ప్రాంతంలో గుడ్‌హోప్ రోడ్డుపై 1600 బ్లాక్ దగ్గర గుర్తుతెలియని వ్యక్తి కాల్పులకు తెగబడగా ముగ్గురు చనిపోయారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని సమీప ఆసుపత్రికి తరలించినట్లు డీసీ మెట్రోపాలిటన్ పోలీస్ చీఫ్ పమేలా స్మిత్ తెలిపారు. ఈ ఘటన శనివారం రాత్రి 8గంటలప్పుడు జరిగిందన్నారు. చనిపోయిన వారిలో ఒక మహిళ ఉన్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తి సమాచారం లేదన్నారు.

కొలంబియాలో నిషేధిత ఆయుధాన్ని దుండగుడు వినియోగించారని, ఇదేమీ యుద్ధ క్షేత్రం కాదని, తమ పౌరుల భద్రతే తమకు ముఖ్యమని స్మిత్ తెలిపారు. కాల్పులు జరిపిన వ్యక్తిని పట్టుకునేందుకు స్థానికుల సహకారాన్ని ఆమె కోరారు. ఘటన జరిగినది పర్యాటక ప్రాంతం కావడంతో తాజా ఘటన అక్కడి ప్రజలను భయాందోళనకు గురిచేసింది. దుండగుడి ఉద్దేశం కూడా అదేనని, ప్రజలను భయపెట్టడమేనని, హింసను ఆపేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు తోడ్పాటును అందజేయాలని స్మిత్ పిలుపునిచ్చారు. కాగా, వాషింగ్టన్‌లో ఇప్పటి వరకు 150 మందికి పైగా కాల్పుల ఘటనల్లో మృతి చెందారు. ఈనెల్లో అప్పుడే పది మందికిపైగా కాల్పివేతకు గురయ్యారు.

విశాలాంధ్ర ప్రపంచం

ఇజ్రాయిల్‌లో ఆగని ప్రజానిరసనలు

31 వారాలుగా న్యాయ సంస్కరణల వ్యతిరేక ఆందోళనలు

టెల్ అవీవ్: ఇజ్రాయిల్‌లో ప్రజానిరసన ఆగడం లేదు. నెతన్యాహు ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా ఆందోళనలు 31వ వారానికి చేరుకున్నాయి. లక్ష మందికిపైగా టెల్ అవీవ్ వీధుల్లోకి వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. తమ నిరసను వ్యక్తంచేశారు. సంస్కరణల ఉపసంహరణకు డిమాండ్ చేశారు. ఇసుక వేస్తే రాలని చందంగా రోడ్లన్నీ నిరసనకారులతో నిండిపోయిన దృశ్యాలను స్థానిక మీడియా ప్రసారం చేసింది. దేశవ్యాప్తంగా 150 ప్రాంతాల్లో నిరసనలు, ప్రదర్శనలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ పతాకాలు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ నిరసనకారులు కదంతొక్కారు. న్యాయ సంస్కరణల బిల్లు తొలి రౌండు ఓటింగ్ జరుగగా పార్లమెంటు ఆమోదించింది. జడ్జిల నియామకంతో పాటు అనేక రకాల అధికారాలను తమ గుప్పెట్లో పెట్టుకునే విధంగా ఏకపక్షంగా ఈ బిల్లును నెతన్యాహు ప్రభుత్వం ఆమోదింపజేయిస్తుండటాన్ని ఇజ్రాయిల్ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. బిల్లు ఉపసంహరణకు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

పట్టాలు తప్పిన హజారా ఎక్స్‌ప్రెస్

30 మంది దుర్మరణం-80 మందికి గాయాలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఆదివారం ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో 30 మంది చనిపోగా 80 మంది గాయపడ్డారు. హజారా ఎక్స్‌ప్రెస్ 10 బోగీలు పట్టాలు తప్పిన ఘటన కరాచీకి 275కిమీల దూరంలోని సహారా రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. దీంతో సింధ్ జిల్లాలో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. గాయపడిన వారిని నవాబ్‌షాలోని పీపుల్స్ మెడికల్ ఆసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా సాంకేతిక లోపాన్ని సృష్టించి ప్రమాదం జరిగేలా ఎవరో చేశారనిపిస్తోందని రైల్వే మంత్రి ఖ్వాజా సాద్ రఫీక్ వెల్లడించారు. వాస్తవ కారణాలు తెలియాల్సి ఉందన్నారు. 10 బోగీలు పట్టాలు తప్పినట్లు రైల్వే డివిజనల్ సూపరింటెండెంట్ రెహమాన్ ధ్రువీకరించారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని, పాకిస్తాన్ సైన్యం, 100 మందికిపైగా పోలీసులు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రమాదస్థలి చుట్టుపక్క ఆసుపత్రులను అప్రమత్తం చేసినట్లు అధికారులు వెల్లడించారు. అంబులెన్సుల్లో హుటాహుటిన క్షతగాత్రుల తరలింపు కొనసాగుతున్నట్లు చెప్పారు. మూడు రోజుల కిందట అల్లమా ఇక్బాల్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. అయితే ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దశాబ్ద కాలంలో పాకిస్తాన్‌లో ఘోరమైన రైలు ప్రమాదాలు పెరిగాయి.

దసరా నాటికి విశాఖ నుంచి పాలన!

(మొదటిపేజీ తరువాయి)

విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు చెందిన మరో భవనంలో సీఎం నివాసముండేందుకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తి కావొచ్చినట్టు సమాచారం. అయితే ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ఎదురుగా ఉన్న బే పార్కులో నివాసం ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఉండేలా ఈ ఏర్పాట్లు ఉండనున్నాయి. దీంతో ముఖ్యమంత్రి రాకపోకలకు బీచ్ రోడ్ లో వాహనదారులకు ఎటువంటి ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కేవలం విమానాశ్రయానికి వెళ్లడానికి మాత్రమే ట్రాఫిక్ ఆపాల్సి ఉంటుంది. మిగతా ఏ సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇక ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బస చేసేందుకు నగరంలోని ఖరీదైన ప్రాంతం సీతమ్మధారను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ముఖ్యమంత్రికి నివాస ప్రాంతానికి దగ్గరలో గల ఎండాడ ప్రాంతంలో అధికారుల నివాసం ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఆలోచనలో కూడా ఉన్నారు. మరోపక్క ముఖ్యమంత్రి జగన్ వారంలో మూడు రోజులు విశాఖలో, మూడు రోజులు అమరావతిలో ఉంటారని మరో ప్రచారం సాగుతోంది. ఇక శాఖల వారీగా కార్యాలయాల ఏర్పాటుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీఎంఆర్డీఏ, జీవీఎంసీ భవనాలను ఎంపిక చేయడంలో తలమునకలై ఉన్నట్లు తెలుస్తోంది.

కాజేసిన భూముల ధరల పెంపుకోసమే...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖపట్నంపై, ఉత్తరాంధ్రపై ఏమాత్రం ప్రేమ లేదని, ఈ ప్రాంతంలోని విలువైన భూముల్ని తమ అనుచరులకు కట్టబెట్టడానికే విశాఖ వస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే విశాఖలో విలువైన భూములు అనేకమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, వారి అనుచరుల చేతుల్లోకి వెళ్లి పోయాయని, అసైన్డ్ భూములను కూడా తక్కువ ధరకు కాజేశారని... ఇప్పుడు రాజధాని పేరిట వాటిని అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని విపక్షాలు మండిపడుతున్నాయి.

రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి

(మొదటిపేజీ తరువాయి)

లేదన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం ముందుకు సాగటం లేదని, ఐటీ రంగం ఊసే లేదన్నారు. కొత్తగా ఒక్క పరిశ్రమ రాకపోగా ఏపీలో ఉన్న పరిశ్రమలు కూడా పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. రూ.9,600 కోట్ల పెట్టుబడితో తెలంగాణలో అమర్‌రాజా కంపెనీ విస్తరణ చేపట్టిందన్నారు. రాష్ట్రంలో విస్తరణ చేపట్టాలని భావించిన తైవాన్ కంపెనీ రూ.1,600 కోట్లు పెట్టుబడిని తమిళనాడుకు తరలించిందన్నారు. కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న పరిస్థితులపై సీఎం జగన్ ఇప్పటికైనా నోరు విప్పాలన్నారు. కక్ష పూరితంగా అమర్ రాజా కంపెనీ బస్సుపై, ఉద్యోగులపై వైసీపీ శ్రేణులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అల్లర్లు పెచ్చుమీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు చేయటం సహజమని, సాక్షాత్తూ మంత్రులే ప్రతిపక్షాలను పర్యటించవద్దని రెచ్చగొట్టటం దారుణమన్నారు. జీవో నంబరు 1ను హైకోర్టు కొట్టేసిన తరువాత కూడా ప్రతిపక్షాల ర్యాలీలు, సభలు అడ్డుకునేందుకు వైసీపీ చూడడం దుర్మార్గమని మండిపడ్డారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కూడా అభివృద్ధిని పట్టించుకోకుండా మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం, కార్పొరేట్‌లకు ఊడిగం చేయటమే అజెండాగా పెట్టుకుందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అక్టోబరు 24 నుంచి వారానికి మూడు రోజులు విశాఖలోనే ఉండనున్నట్లు వస్తున్న వార్తలపై విలేకరులు రామకృష్ణ స్పందన కోరగా 'సీఎం జగన్ ఎవరితో మాట్లాడడు. ఎవరినీ కలవనివ్వడు. పరిపాలన గాలికొదిలేశాడు. అభివృద్ధిపై దృష్టిలేదు. అలాంటప్పుడు విశాఖలో ఉన్నా, తాడేపల్లిలో ఉన్నా, లేక సముద్రంలోని ఓడలో ఉన్నా ఒరిగేది, పోయేది, వచ్చేది ఏమి ఉండదు' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 39 రైల్వేస్టేషన్ల అభివృద్ధి

న్యూఢిల్లీ: అమృత్ భారత్ పథకం కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 39 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. అమృత్ భారత్ పథకం కింద తొలిదశలో తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 39 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. ఏపీలో రూ.453.50 కోట్లతో 18 స్టేషన్లు, తెలంగాణలో రూ.894.09 కోట్లతో 21 స్టేషన్లు అభివృద్ధి చేయనున్నారు. ఏపీలోని ఏలూరు రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొనగా, నాంపల్లి రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ తమిళిసై, కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఎంపీ బండి సంజయ్ పాల్గొన్నారు. ఏలూరు, తుని, ఒంగోలు, సింగరాయకొండ, దొనకొండ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తారు.

అణ్వస్త్రాలు లేని ప్రపంచం కావాలి

హిరోషిమాపై అణు దాడికి 78ఏళ్లు

టోక్యో: అణ్వస్త్రాలు లేని ప్రపంచం కావాలని, అణునిరాయుధీకరణకు ప్రతి దేశం సంకల్పించాలని వక్తలు పిలుపునిచ్చారు. జీ7దేశాల అణ్వాయుధాల నిరోధక విధానం 'మూర్ఖత్వం' అని హిరోషిమా మేయర్ కజుమీ మట్సుయ్ అన్నారు. అణ్వాయుధాల రహిత ప్రపంచం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ రెండవ యుద్ధం తుది దశలో హిరోషిమాపై అణు బాంబుతో దాడి జరిగి ఆదివారానికి 78ఏళ్లు అయ్యాయి. అణుదాడి మృతులు 50వేల మందికి జపాన్ ప్రజలు, ప్రధాని కిషిదా తదితర నాయకులు నివాళులర్పించారు. అణుదాడికి 78 ఏళ్లను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ అణ్వాయుధ రహిత ప్రపంచ సాధన మార్గం మరింత క్లిష్టంగా మారడానికి ప్రస్తుతం యుద్ధాలు, ఉద్రిక్తతలు పెరగడమే కారణమని అన్నారు. ఈ భయానకస్థితి నుంచి బయట పడాలి, మనం కోరుకునే ఆదర్శ ప్రపంచం సాధనకు పటిష్ఠ చర్యలను తీసుకోవాలన్నారు. అణుదాడి స్మారకాన్ని సందర్శించిన ప్రధాని ఫుమియో కిషిదా, మృతులకు శిరస్సు వంచి అంజలి ఘటించారు. అణు నిరోధక ప్రపంచానికి పిలుపునిచ్చారు. అయితే ఈ ఏడాది జీ7 సదస్సు హిరోషిమాలో జరగనుంది.

అణు యుద్ధ భేరి మోగుతోంది: గుటెర్రస్

రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధంతో అణ్వాయుధాల ముప్పు పెరుగుతున్న దృష్ట్యా అణు యుద్ధభేరి మోగుతోందని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఆందోళన వ్యక్తంచేశారు. అణు నిరాయుధీకరణకు ప్రతి ఒక్కరు సంకల్పించాలని, మళ్లీ అణ్వాయుధాల యుద్ధభేరి మోగుతున్న దృష్ట్యా దానిని ఆపేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. హిరోషిమాపై అణు బాంబు దాడికి 78ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పై విధంగా స్పందించారు.

ఈ ప్రాంతాన్ని సందర్శించిన నేతలంతా అక్కడి స్మారకాలను చూసి స్థానికులు పడిన కష్టాన్ని తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించారు. కానీ మరోమారు అణ్వాయుధ ముప్పు పెరుగుతోంది. దీనిని ఆపాలి అని ఆయన పేర్కొన్నారు.

గద్దర్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఉద్యమ సమయంలో ఊరురా తిరిగి ప్రచారం చేసేందుకు ఆయన బుర్రకథను మార్గంగా ఎంచుకున్నారు. ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకులు బి.నరసింగరావు భగత్ సింగ్ జయంతి రోజున ఒక ప్రదర్శనకు అవకాశమిచ్చారు. ఆ తర్వాత ప్రతి ఆదివారం ఆయన తన ప్రదర్శనలు ఇచ్చేవారు. 1971లో బి.నరసింగరావు ప్రోత్సాహంతో మొదటి పాట 'ఆపర రిక్షా' పాట రాశారు. ఆయన మొదటి ఆల్బం పేరు గద్దర్. ఇదే ఆయన పేరుగా స్థిరపడింది. మాభూమి చిత్రంలో 'బండెనక బండికట్టి' పాటపాడి నటించారు. 1997లో గద్దర్‌పై హత్యాయత్నం జరిగింది. చాలాకాలం శరీరంలో తూటాతోనే జీవించిన గద్దర్ తెలంగాణ ఉద్యమానికి తన పాటలతో ఊపుతెచ్చారు. ప్రజా గాయకుడిగా గుర్తింపు పొందారు. తన పాటలతో దాదాపు 50 ఏళ్లుగా ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. తెలంగాణ యాసలో ఆయన పాడిన పాటలు ఎందరినో ఉర్రూతలూగించాయి. తెలంగాణ ఉద్యమం రెండవ దశలో గద్దర్ రాసిన పాటల్లో 'అమ్మ తెలంగాణమా' అనే పాట తెలంగాణ ఉద్యమాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. 'జై బోలో తెలంగాణ' సినిమాలో తెరపై కూడా ఆయన కనిపించారు. 'పొడుస్తున్న పొద్దూ' మీద పాట ఆయనే రాసి పాడి, అభినయించారు. ఈ పాట తెలంగాణ ఉద్యమంలో గొప్ప ప్రాచుర్యం పొందింది. అలాగే 'నీ పాదం మీద పుట్టు మచ్చనై చెల్లెమ్మ' అనే పాటకు ఉత్తమ గీతంగా నంది అవార్డు కూడా దక్కింది. అయితే ఆయన ఆ అవార్డును తిరస్కరించారు. నన్ను గన్న తల్లులారా, అడవి తల్లి బిడ్డలారా, అమ్మ తెలంగాణ మా ఆకలి కేకల గానమా, మల్లె తీగకు పందిరి వోలె, మస్క చీకటిలో వెన్నెల వోలె చెల్లెమ్మ అంటూ ఆయన పాడిన పాటలు మంచి గుర్తింపు తీసుకువచ్చింది. గద్దర్ మరణంతో ఆయన ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. తెలంగాణ ప్రజానీకం, విప్లవకారులు, ఉద్యమకారులు, రాజకీయ, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా గద్దర్‌కు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

గద్దర్ మరణం బాధాకరం: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ మరణం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ప్రగాఢ సంతాపం తెలిపారు. గద్దర్‌కు, తనకు ఎంతో సన్నిహిత సంబంధం ఉందని అన్నారు. నాడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ గద్దర్, తాను కలిసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించామని, ఆ ప్రాంత బొగ్గు కార్మిక ప్రాంతాలకూ వెళ్లామని గుర్తు చేశారు. గద్దర్ విప్లవ పోరాటంలో ప్రముఖమైన పాత్ర పోషించారని, వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాల్లో, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆయన తలమానికంగా ఉన్నారని కొనియాడారు. పొడుస్తున్న పొద్దుమీద... నడుస్తున్న కాలమా... అనే గేయం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్మోమోగిందన్నారు. అలాంటి ఉత్తేజకరమైన నాయకుడు గద్దర్ హఠాన్మరణం చాలా బాధాకరమని, వారి మరణం పట్ల సీపీఐ ప్రగాఢ సంతాపం తెలియజేస్తోందన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్‌ను రాష్ట్ర ప్రముఖుడిగా గుర్తించి, ఆయన పేరిట ఒక స్మారక సంస్థ ఏర్పాటు చేసి, గద్దర్ సేవలను చిరకాలం గుర్తుండేలా చర్యలు తీసుకోవాలని నారాయణ సూచించారు.

పాటలతో జనచైతన్యం గావించిన గద్దర్ : రామకృష్ణ

ప్రజా గాయకుడు గద్దర్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రజా సమస్యలపై జరిగే పోరులో గద్దర్ ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు తనదైన శైలిలో పాటలు రచించి, పాడి జన చైతన్యం గావించేవారన్నారు. తెలుగు సాంస్కృతిక రంగంలో గద్దర్ కీలకపాత్ర పోషించారని



పేర్కొన్నారు. గద్దర్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, ఏపీ, తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరి శివప్రసాద్, ఆర్‌వీ రామారావు, రాపోలు భాస్కర్ సంతాపం తెలిపారు.

గద్దర్ మరణంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బడుగు, బలహీనవర్గాల విప్లవ స్ఫూర్తి గద్దర్ అని, ఆయన పాట ఎప్పుడూ సామాజిక సంస్కరణల పాటేనని, నిరంతరం సామాజిక న్యాయం కోసమే బతికారని కొనియాడారు. ఆయన మరణం ఊహించనిదన్నారు. సామాజిక న్యాయ ప్రవక్తల భావాలు, మాటలు, వారి జీవితాలు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూ జీవించే ఉంటాయన్నారు. గద్దర్‌కు తెలుగు జాతి సెల్యూట్ చేస్తోందని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో మనమంతా బాసటగా ఉందామన్నారు. గద్దర్ మరణంపై రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణంతో ప్రజాగానం మూగబోయిందన్నారు. దళిత, గిరిజన, బలహీన వర్గాలకు జీవితాంతం అండగా నిలిచిన మహనీయుడు గద్దర్ అని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు.

సీఎం కేసీఆర్, రాహుల్ నివాళి

గద్దర్ మరణించిన విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి వారు సంతాపం వ్యక్తం చేశారు.

అలాగే విషయం తెలిసిన వెంటనే అపోలో ఆస్పత్రికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చేరుకున్నారు. గద్దర్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన వారిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, సీతక్క, ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, వీహెచ్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో

మూడు శాతం డీఏ పెంపు!

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో మూడు శాతం కరువు భత్యం(డీఏ) పెరగబోతోంది. ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం కేంద్రం డీఏ పెంచడానికి అంగీకరించింది. ప్రస్తుతం 42 శాతం డీఏ ఇస్తున్న కేంద్రం...మరో మూడు శాతం పెంచి 45 శాతం ఇవ్వబోతోంది. ప్రతి నెలా లేబర్ బ్యూరో వెల్లడించే 'పారిశ్రామిక కార్మికుల కోసం వినియోగదారుల ధరల సూచీ'(సీపీఐ-ఐడబ్ల్యూ) ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ వివరాలు తెలిపింది. కార్మిక మంత్రిత్వ శాఖ పరిధిలో లేబర్ బ్యూరో పని చేస్తోంది. సీపీఐ-ఐడబ్ల్యూ ఆధారంగా కరువు భత్యాన్ని నిర్ణయించారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు వర్తిస్తుంది. ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా మాట్లాడుతూ 2023 జూన్ నెల సీపీఐ-ఐడబ్ల్యూను జులై 31న విడుదల చేశారన్నారు. కరువు భత్యం నాలుగు శాతం పెంచాలని తాము డిమాండ్ చేస్తున్నామని, కానీ ప్రభుత్వం మూడు శాతానికి కొంచెం ఎక్కువ ఉండవచ్చునని, దశాంశ స్థానాలకు మించి పెంచడానికి ప్రభుత్వం అంగీకరించదని చెప్పారు. కాబట్టి డీఏ మూడు శాతం పెరగవచ్చునని, అంటే 45 శాతం డీఏ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆర్థికశాఖలోని వ్యయ విభాగం కరువు భత్యం పెంపు ప్రతిపాదనను తయారు చేస్తుందన్నారు. దీనివల్ల ఖజానాకు ఎదురయ్యే పర్యవసానాలను వివరిస్తుందన్నారు. దీనిని కేంద్ర కేబినెట్ ఆమోదించవలసి ఉంటుందన్నారు. పెంచిన డీఏ 2023 జులై 1 నుంచి వర్తిస్తుంది. ప్రస్తుతం దాదాపు కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు కరువు భత్యాన్ని పొందుతున్నారు. ఈ ఏడాది మార్చి 24న కూడా డీఏ సవరణ జరిగింది. దీనిని ఈ ఏడాది జనవరి 1 నుంచి వర్తింపజేశారు.

వరద బాధిత ప్రాంతాల్లో

నేడు, రేపు సీఎం పర్యటన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7, 8 తేదీల్లో పర్యటిస్తారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సీఎం పర్యటిస్తారు. వరద బాధిత గ్రామాల ప్రజలతో నేరుగా సీఎం మాట్లాడతారు. 7వ తేదీ ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఏఎస్‌ఆర్ జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట చేరుకుంటారు. అక్కడ వరద ప్రభావిత ప్రాంతాలు, సహాయక చర్యలపై అధికారులతో మాట్లాడిన అనంతరం కూనవరం బస్‌స్టాండ్ సెంటర్‌లోని కూనవరం, వీఆర్ పురం మండలాల వరద బాధితులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి బయలుదేరి కుక్కునూరు మండలం గొమ్ముగూడేనికి చేరుకుంటారు. అక్కడ వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన అనంతరం వరద బాధిత కుటుంబాలతో సమావేశమవుతారు. తర్వాత రాజమహేంద్రవరం చేరుకుంటారు. అక్కడ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం తర్వాత రాత్రికి అక్కడే సీఎం బస చేస్తారు.

ఈహెచ్‌ఎస్ అరకొర

▸ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య కార్డులు అలంకారప్రాయంగా మారాయి. ఉద్యోగులకు ఆరోగ్య కార్డుల ద్వారా పూర్తిస్థాయిలో వైద్యం అందడం గగనంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు మెరుగైన ఆరోగ్య రక్షణ కోసం కల్పించిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. ఈహెచ్‌ఎస్ ద్వారా ఉద్యోగులకు నగదు రహిత (క్యాష్ లెస్) వైద్యసేవలు మొక్కుబడిగా అందుతున్నాయి. అత్యవసర వైద్యం కోసం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్తే... అక్కడ నగదు రహిత వైద్యం అందించేందుకు యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కేవలం మొక్కుబడిగా కొన్ని ఆస్పత్రులలోనే నగదు రహిత వైద్యం అందుతున్నట్లు తెలుస్తోంది. వాటి వివరాలు ఉద్యోగులందరికీ తెలియడం లేదు. సకాలంలో అత్యవసర వైద్యం లభించకపోవడంతో చేసేదేమీ లేక నెట్‌వర్క్ ఆసుపత్రుల్ని ఉద్యోగులు ఆశ్రయించి, తమ సొంత డబ్బుతో వైద్యం చేయించుకొని అప్పుల పాలవుతున్నారు. జగన్ ప్రభుత్వంలో ఆరంభం నుంచి ఇదే సమస్యను ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. చాలాసార్లు సీఎంకు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఈ సమస్యపై ఉద్యోగ సంఘాలు విన్నవించినప్పటికీ ఫలితం లేదు. వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్ల దగ్గర డబ్బులు లేకపోయినప్పటికీ ఆరోగ్య కార్డులు చూపిస్తే తక్షణమే వైద్యం అందించాలనే మంచి ఉద్దేశంతో 2013లో ఈహెచ్‌ఎస్ ప్రారంభించారు. పదేళ్ల నుంచి దీనిని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఉద్యోగ సంఘాలు పదేపదే విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోనందున...ఈ దుస్థితి నెలకొందనే విమర్శలున్నాయి.

నెట్‌వర్క్ ఆస్పత్రులకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లించనందునే ఈ పరిస్థితి ఎదురవుతోంది. హెల్త్‌కార్డు ద్వారా నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉద్యోగులకు వైద్య సేవలు అందించినప్పటికీ ప్రభుత్వం ఇంకా రీయింబర్స్‌మెంట్ చేయలేదు. ఉద్యోగుల నుంచి ప్రతినెలా చందా వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదు. దీంతో కోట్లాది రూపాయల బకాయిలు నెట్‌వర్క్ ఆస్పత్రులకు పేరుకుపోతున్నాయి. మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు రానుండటంతో నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ వైద్యసేవలు అందించేందుకు నిరాకరిస్తున్నాయి. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల విషయం తేల్చాలంటూ పట్టుబడుతున్నాయి. అత్యవసర వైద్యం కోసం నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళ్లిన ఉద్యోగులకు చుక్కెదురవుతుంది. ముందు ఉద్యోగస్తుల సొంత డబ్బులతో వైద్యం చేసుకోవాలని, ఆ తర్వాత మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం విద్యాశాఖ అధికారుల ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నాయి. చేసేదేమీలేక అప్పులతో చికిత్స చేయించుకొని ఉద్యోగులు ప్రాణాలు రక్షించుకుంటున్నారు.

ఆ తర్వాత మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసినప్పటికీ అవి సకాలంలో రావడం లేదు. అరకొరగా మాత్రమే బిల్లులు మంజూరు చేస్తోంది. మెరుగైన వైద్య సౌకర్యాలున్న బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల ఆస్పత్రులకు వెళ్లి వైద్యసేవలు పొందిన ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం కల్పించడం లేదు. దీంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందంటూ సీఎం జగన్ ఆర్భాటంగా చెప్పడమే తప్ప ఆచరణలో కనిపించడం లేదు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెంపు లేదు

మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలన్న ఉద్యోగ సంఘాల డిమాండ్‌పైనా ప్రభుత్వం మౌనం వహిస్తోంది. ఉద్యోగుల అత్యవసర కేసుల్లోనూ నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్యం చేయడానికి నిరాకరిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సంవత్సరపు ఆరోగ్య పరీక్షలపై ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. బయట నుంచి వచ్చే రోగులకు(ఓపీ) ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ వైద్యం, బ్రాండెడ్ జనరిక్ మందులు సక్రమంగా అందడం లేదు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం స్పందించి ఈహెచ్‌ఎస్ పథకం అమలులో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికిగాను ప్రత్యేక కమిటీ వేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులలో ఉద్యోగుల ఆరోగ్య కార్డుల ద్వారా నగదు రహిత సేవలతో వైద్యం అందించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మైనారిటీలపై వివక్ష, బలవంతపు వలసలు

(మొదటిపేజీ తరువాయి)

చేయనివ్వొద్దు, విక్రేతలుగా వారు ఉండరాదని పోలీసు అధికారులకు రాసిన లేఖలో సర్పంచ్ పేర్కొన్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు. ముస్లింలను దొంగలుగా, దోపిడీదారులుగా, పశుదొంగలుగా చిత్రీకరించిన తీరు ఆశ్చర్యపరిచిందని, గ్రామంలో శాంతికి విఘాతం కలగకూడదనే ఈ చర్యలని చెబుతూ లేఖలో ఉందన్నారు. ముస్లింలు కనిపిస్తే ఘర్షణలు జరుగుతాయంటూ వారిని ఆ ప్రాంతం నుంచి బలవంతంగా తరిమేస్తున్నారని తెలిపారు.

మతసామరస్యం అనేది విద్వేష-విభజన రాజకీయాలకు బలిపశువుగా మారిందని, రెండు వర్గాల మధ్య కృత్రిమ విద్వేష బీజాన్ని నాటుతున్న పద్ధతి ప్రమాదకరమని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. నూహ్ సరిహద్దు వద్ద పోలీసులు తమను అడ్డగించారని తెలిపారు. తాము కలిసిన ప్రతి ఒక్కరికి శాంతి, సామరస్యాన్ని ఉద్బోధించినట్లు చెప్పారు. హింసాత్మక ఘటనలపై సమగ్ర విచారణ, బాధితులకు తగిన పరిహారం, నూహ్, గురుగ్రామ్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. నూహ్‌లోకి ప్రవేశించకుండా పోలీసులు తమను అడ్డుకున్నట్లు వినయ్ విశ్వం తెలిపారు.

ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నా బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం భయపడుతోందని, ఎన్నికలే లక్ష్యంగా ప్రజలను విభజించాలని చూస్తోందని విశ్వం విమర్శించారు.

విశాఖ ఉక్కుపై మౌనమేల?

- బీజేపీకి భయపడుతున్న వైసీపీ, టీడీపీ, జనసేన
- కార్మిక సంఘాల అలుపెరగని పోరు
- వామపక్షాల అండదండలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం (విశాఖ జిల్లా): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన మౌనంపై కార్మికసంఘాలు మండిపడుతున్నాయి. ఎంతోమంది ప్రాణత్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఈ పార్టీలకు లేదా అని నిలదీస్తున్నాయి. విశాఖ ఉక్కును కాపాడతామని ప్రగల్భాలు పలికిన రాజకీయ పార్టీలు ఇప్పుడు పూర్తిగా నోరుమెదపడం లేదు. కార్మిక సంఘాలు సుదీర్ఘకాలంగా పోరాటాలు సాగిస్తున్నా కనీసం సంఘీభావం కూడా తెలపడం లేదు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ పార్టీలు మౌనం వహిస్తున్నాయని నిలదీస్తున్నాయి. విశాఖ ఉక్కు పరిరక్షణపై రాజకీయ పార్టీల ద్వంద్వ వైఖరిని కార్మిక కుటుంబాలు, ప్రజలు తూర్పారబడుతున్నారు. విశాఖ ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా వైసీపీ, టీడీపీ, జనసేన మాటలు కంటితుడుపు చర్యలుగానే ఉన్నాయని, ఉక్కు ఫ్యాక్టరీని కాపాడాలన్న చిత్తశుద్ధి కనిపించడం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు. ఆ పార్టీలకు అధికారమే పరమావధి తప్ప రాష్ట్ర ప్రయోజనాలు, కేంద్రంపై పోరాటం గురించి ఆలోచనే లేదని మండిపడుతున్నారు. కార్మిక సంఘాలు మాత్రం వామపక్షాల అండతో 900 రోజులకు పైగా ఉద్యమాలు సాగిస్తున్నాయి.

ముప్పై రెండు మంది ప్రాణత్యాగాలతో...64 గ్రామాల ప్రజలు... 25 వేల ఎకరాల భూమి త్యాగంతో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఏర్పడింది. ఈ ప్లాంట్‌ను ఎలాగైనా అమ్మాలని కేంద్ర ప్రభుత్వం 2021 మే 27న పార్లమెంటులో ప్రకటన చేసింది. నాటి నుంచి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో ఉన్న 21 కార్మిక సంఘాలు ఏకతాటిపైకి వచ్చాయి. పోరాట కమిటీగా ఏర్పడి ఉద్యమం ప్రారంభించాయి. రాష్ట్రంలో, కేంద్రంలో ఎంతోమంది ప్రజాప్రతినిధులు, మేధావుల మద్దతు పొందాయి. విశాఖ ఉక్కును కాపాడతానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం, కేంద్రానికి లేఖ రాయడంతో సరిపెట్టుకున్నారు. తర్వాత విశాఖ ఉక్కు గురించి కనీసం ఒక్కసారి కూడా మాట్లాడిన సందర్భాలు లేవు. ముఖ్యమంత్రి అనేకసార్లు ఢిల్లీ వెళ్లినప్పటికీ విశాఖ ఉక్కుపై ప్రధాని నరేంద్రమోదీతోగానీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తోగానీ చర్చించిన దాఖలాలు లేవు. విశాఖ ఉక్కుపై వెనక్కి తగ్గినట్లు కేంద్రంతో ప్రకటన చేయించడంలో విఫలమయ్యారు. ఆరంభంలో ఆర్భాటం చేసిన టీడీపీ, జనసేన సైతం నోరు మెదపడం లేదు. అధికార, విపక్షాలు పరస్పర నిందారోపణలు తప్ప విశాఖ ఉక్కును కాపాడాలన్న తాపత్రయం కనిపించడం లేదు. మూడు లక్షల కోట్ల రూపాయల సంపదను మోదీ సర్కారు కార్పొరేట్ సంస్థలకు కారు చవకగా అమ్ముతుంటే నోరు మెదపని అధికార, ప్రతిపక్షాలు ఎవరి కోసం పనిచేస్తున్నాయో ప్రజలు గమనిస్తున్నారని కార్మికులు, కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ రెండు రోజుల క్రితం విశాఖపట్నంలో రూ.600 కోట్లతో రహేజాకు సంబంధించిన షాపింగ్ మాల్‌కు శంకుస్థాపన చేశారు. దేశానికే తలమానికమైన విశాఖ ఉక్కు పరిశ్రమలో 7 కోట్ల మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తే అదనంగా వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడుతుంది. స్టీల్ ప్లాంట్, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై కార్మికపోరాటాల ఫలితంగా కేంద్రం కొంతమేరకు వెనక్కి తగ్గింది. ఉత్తరాంధ్ర ప్రజల సహకారంతో కార్మికులు ఉధృత పోరాటాలు చేస్తే తప్ప విశాఖ ఉక్కును కాపాడుకోవడం సాధ్యం కాదని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది. విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రజలు హెచ్చరిస్తున్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో మొదటి నుంచి కార్మికులకు వామపక్షాలు మాత్రమే అండగా నిలిచాయి. కార్మికుల పోరాటాన్ని ముందుండి నడుపుతున్నాయి. కేంద్రంలోని బీజేపీ సహా రాష్ట్రంలోని వైసీపీ, టీడీపీ, జనసేనపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ జరగకపోతే ఈ రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని కార్మికులు హెచ్చరించారు.

చుండూరు హంతకులను శిక్షించాలి...

- 32 ఏళ్లైనా బాధితులకు దక్కని న్యాయం
- దళిత విముక్తి అధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : చుండూరు దళితులపై అగ్ర కులాల హత్యాకాండ ఘటన జరిగి 32 ఏళ్ళయినా ఇంత వరకు న్యాయం జరగలేదని దళిత సంఘాల నేతలు ధ్వజమెత్తారు. ఘటన రోజైన ఆగస్టు 6 సందర్భంగా దళిత విముక్తి ఆధ్వర్యంలో నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. చుండూరు దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, హెచ్ఆర్ఎఫ్ నాయకుడు వి ఎస్ కృష్ణ, డాక్టర్ పిజే సుధాకర్ దళిత హక్కుల సమాఖ్య కొత్తపల్లి వెంకట రమణ, భీమ్ సేన ప్రధాన కార్యదర్శి ఎం.రవి సిద్ధార్థ మాట్లాడుతూ ప్రభుత్వాల తీరును దుయ్యబట్టారు. 1991 ఆగస్టు 6న చుండూరులో దళితులపై మారణకాండకు పాల్పడి... 8 మంది దళితులను హతమార్చారని గుర్తు చేశారు. ఈ కేసులో సాక్షాధారాలు ఉన్నప్పటికీ 13 ఏళ్ల తర్వాత కొంత పాక్షిక న్యాయం జరిగిందని చెప్పారు . ఈ కేసును తిరగతోడి విచారించిన హైకోర్టులో కేసును కొట్టివేయబడిందన్నారు. ఫలితంగా హంతకులు దర్జాగా విడుదలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు, పోలీసులు హంతకులకు కొమ్ము కాయడం వల్లే అన్యాయం జరిగిందన్నారు. సుప్రీంకోర్టులో ఈ కేసును అప్పీలు చేసినప్పటికీ త్వరితగతిన పరిష్కారం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి చొరవ లేదన్నారు. దేశంలో అనేక కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా పరిష్కారం చేశారు.. దళితుల కేసుల విషయంలో మాత్రం తీవ్ర జాప్యం దేనికని ప్రశ్నించారు. దళితుల హత్యల పరంపర కొనసాగుతున్నా.. వాటిని అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని మండిపడ్డారు. దళితులు పోరాడి సాధించుకున్న ఎస్సీ ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రభుత్వాల తీరు వల్లే నిర్వీర్యం అవుతుందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో మనువాద ప్రభుత్వం కొనసాగుతుందని, అనేక రాష్ట్రాలలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై ప్రభుత్వ ప్రేరేపిత హత్యాకాండలు కొనసాగుతున్నాయని అన్నారు. దళిత, బహుజనులకు రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత విముక్తి ప్రతినిధులు బి.అప్పారావు, బి.సన్యాసమ్మ, బి.రామకృష్ణ కె.కుమార్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధి ఎస్.గురవయ్య, భారత నాస్తిక సమాజం రాం ప్రభు, దళిత కళామండలి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నివారణలో

అమెరికా జోక్యం తగదు

హీరోషిమా డే సందర్భంగా శాంతి ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ: రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య ఏడాదిన్నర కాలం నుంచి సాగుతున్న యుద్ధం నివారించకపోగా సామ్రాజ్యవాద దేశాలు ప్రధానంగా అమెరికా మరింతగా కాలు దువ్వుతూ ఆజ్యం పోస్తుందని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో) రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు, సాంస్కృతిక స్నేహ సహకార సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు విమర్శించారు. హిరోషిమా, నాగసాకి డే సందర్భంగా ప్రపంచ శాంతి కోరుతూ 'యుద్ధం, ఉన్మాదం వద్దు' 'మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపండి' అని కోరుతూ అయిప్సో, ఇస్కఫ్ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక లెనిన్ కూడలి వద్ద శాంతి ప్రదర్శన నిర్వహించారు. అణ్వాయుధాలు కాదు.. అన్న వస్త్రాలు కావాలి.. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి.. మతోన్మాదం నశించాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిరోషిమాలో ఆనాటి అణు బాంబు దాడి వల్ల భారీ విధ్వంసం జరిగి లక్షల మంది తమ ప్రాణ, ఆస్తులను కోల్పోయారన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్ బాబు, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య ఆధిపత్యం కేవలం సంపద దోపిడీ కోసమే అన్నారు. నాటో కూటమి కుట్రలు చేస్తుందని, రక్షణ రంగం, అణ్వాయుధాలు తయారీకి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మోతుకూరి అరుణకుమార్, ఏపీ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసులు, మతాల మధ్య వివాదాలు సృష్టించి.. బీజేపీ తన ఉన్మాద వైఖరి తేటతెల్లం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు వేణు, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు బీ. నాసర్ జీ, ధనుంజయుడు, మస్తాన్, కే హర్ష వర్ధన్, బండి చలపతి, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన పెన్షన్ సాధన పాదయాత్ర

కదం తొక్కిన రక్షణరంగ కార్మిక ఉద్యోగులు

విశాలాంధ్ర - మల్కాపురం (విశాఖ జిల్లా): రక్షణరంగ కార్మిక ఉద్యోగులు కొత్త పెన్షన్‌ను నిరసిస్తూ.. పాత పెన్షనే కావాలంటూ పాదయాత్ర చేశారు. కొత్త టె(పె)న్షన్ వద్దు-పాత పెన్షన్ ముద్దు అనే నినాదం హోరెత్తుతుండగా.. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రక్షణరంగ కార్మికోద్యోగులు శ్రీహరిపురం (కోరమాండల్ గేటు) నుంచి నేవల్‌బేస్ (తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం) వరకూ చేసిన పాతపెన్షన్ పాదయాత్ర కార్మిక శక్తికి, ఉద్యమస్ఫూర్తికి ప్రతీకగా నిలచింది. శ్రీహరిపురం చేరుకున్న కార్మికులు శాంతియుత నిరసన చేశారు. నగర పోలీసుల సమక్షంలో జరిగిన ఈ పాదయాత్రకు ఉమ్మడి విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు యు.వి.ఎస్.ఎన్. వర్మ లాంఛనంగా అరుణపతాకం (ఎర్రజెండా) ఊపి.. శ్రీకారం చుట్టారు.

ఈ పాదయాత్రలో ఎన్‌సీఈ, ఎన్ఏడీసీఈ, ఎన్‌బీసీసీఈ, ఎంఈఎస్‌సీఈ, ఎన్ఎస్టీఎల్ సీఈ , డీజీఎన్‌పీసీఈ యూనియన్లు, ఇతర రక్షణరంగ సంస్థలు భాగస్వామ్యం వహించాయి. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకట రావు పాదయాత్ర, అనంతరం తూర్పు నౌకాదళ ప్రధానకేంద్రం (నేవల్ బేస్) ప్రవేశ ద్వారం వద్ద జరిగిన ముగింపు సభకు సారథ్యం వహించారు. పెన్షన్ భిక్ష కాదు ఉద్యోగుల హక్కు... దానిని సాధించే వరకు పోరాటం కొనసాగించాలని ఆయన కోరారు. ఆరేడు సంవత్సరాలైనా జీతాలకు సంబంధించిన ఎరియర్స్ ఇవ్వడం లేదని, ఎప్పుడు నగదు రహిత వైద్యసేవలు సౌకర్యాలు ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఇతర జాతీయ ఫెడరేషన్లు ఉమ్మడిగా ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలో ఈ నెల 10వ తేదీన పెన్షన్ సాధన కోసం యావత్తు కార్మికరంగం కదంతొక్కనుందన్నారు. ఈ సభలో పి. గోపాల కృష్ణ, ఆర్ కె ఎస్ వి కుమార్, కె.నాగార్జున రావు, చింతా చిట్టిరాజు, టి.సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. టి.రాజేష్ వర్మ, రతన్ రాజు , అహ్మద్, మారుతి వరప్రసాద్, నూకరాజు, కాకర వి వి ఎస్ డి కుమార్, యడ్ల అంజనీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలను నిర్లక్ష్యం చేశారు

- అందుకే రైతులకు ఇబ్బందులు
- వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: సమగ్ర ప్రణాళికతో గోదావరి నుంచి సోమశిల ద్వారా నెల్లూరుకు నేరుగా నీళ్లు తీసుకురావొచ్చునని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. గోదావరి-పెన్నా అనుసంధానంలో భాగంగా సాగర్ కుడి కాల్వనుంచి సోమశిల లింక్ ప్రాజెక్టును వైసీపీ ఏమాత్రం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. తెలుగు గంగ ప్రాజెక్టు సరైన నిర్వహణ లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ ఆలోచనతో నెల్లూరు జిల్లాకు 146 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు సోమశిల కండలేరు రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టామన్న చంద్రబాబు... శ్రీశైలం ఫోర్ షోర్ నుంచి కృష్ణా జలాలను పెన్నాలో కలిపి దేశంలోనే మొట్టమొట్టదటి నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆయకట్టు పెంచేందుకు ఎటు వంటి చర్యలు లేవని, లైనింగ్ పనుల్ని పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జిల్లాలో రైతులు పంటలు పండించలేకపోతున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి పేరిట రాష్ట్రంలోని ప్రాజెక్టులను సందర్శిస్తూ వైసీపీ నేతలను తూర్పారబడుతున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు ఆదివారం నెల్లూరు జిల్లాలో పర్యటించారు. నెల్లూరులోని కస్తూరి దేవి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఐదు నదులు అనుసంధానం చేస్తే ఆంధ్రప్రదేశ్ కు నీటి కష్టాలు ఉండవని పేర్కొన్నారు. నీళ్లను సద్వినియోగం చేసుకుంటే సిరులు పండించవచ్చని కృష్ణా మిగులు జలాలను వినియోగించుకోవాలని ఆ నాడే శ్రీకారం చుట్టామన్నారు. ఆంధ్రప్రదేశ్ నీటి అవసరాలు తీర్చిన తరువాతే చెన్నైకి నీరిస్తామని ఎన్టీఆర్ తేల్చి చెప్పారని గుర్తు చేశారు. రాయలసీమ నాలుగు జిల్లాలు, నెల్లూరు జిల్లా ప్రాజక్టులు పూర్తి చేసింది టీడీపీ హయాంలోనేనన్నారు. సోమశిల ప్రాజెక్టు మిగిలిన పనులు 2020 కల్లా పూర్తి చేస్తామన్న జగన్ హామీ నెరవేరలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కండలేరు రిజర్వాయర్ కు 2014లో అటవీ శాఖ అనుమతులు తెచ్చి... మరో లక్షా 30 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాగుకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్ పనులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిం చకపోవడంతో ఆగిపోయాయన్నారు. అల్లూరుపాడు ప్రాజెక్టు ను రివర్స్ టెండరింగ్ పేరుతో డ్రామా ఆడి టెండర్లు రద్దు చేశారని మండిపడ్డారు. సంగం బ్యారేజీ కేవలం మిగతా 17 శాతం పనులకు మూడున్న రేళ్లు పైగా తీసుకొని పనులు పూర్తి చేయకుండానే పేరు మార్చి హడావుడిగా ప్రారంభోత్సవం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు బ్యారేజీకి 10శాతం పనులు మిగిలి ఉండగానే ప్రారంభోత్సవం చేసేశారని, నెల్లూరు ఫ్లడ్ బ్యాంక్స్ బిల్లులు సక్రమంగా చెల్లించనుందున పనులు మందకొడిగా సాగుతున్నాయని దుయ్యబట్టారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత రివర్స్ రెండరింగ్ 365 జీవో ద్వారా ప్రాజెక్టుల్ని ప్రిక్లోజ్ చేశారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి కోసం రూ.5300 కోట్లు ఖర్చు చేశారని, అనేక అడ్డంకుల తరువాత పోలవరాన్ని 72 శాతం పూర్తి చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం పుణ్యమాని రివర్స్ రెండరింగ్ ద్వారా పోలవరం నత్తనడకన సాగుతోందన్నారు. పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని, అప్పర్ కాఫర్ డ్యాం, గైడ్ బండ్ లు దెబ్బతిన్నాయన్నారు. అనుభవం, అవగాహన లేని ముఖ్యమంత్రి తీరు వల్ల జరుగుతున్న నష్టం చూస్తుంటే బాధేస్తుందన్నారు. టీడీపీ పాలనలో ఇరిగేషన్ కు రూ.68,293 కోట్లు ఖర్చు చేస్తే... వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లల్లో కేవలం రూ.22,165 కోట్లు ఖర్చు చేసిందన్నారు. నెల్లూరు, రాయలసీమల్లో టీడీపీ ప్రభుత్వం రూ. 13,939 కోట్లను ఇరిగేషన్ కు ఖర్చు చేసిందని, వైసీపీ రూ.2637 కోట్లను మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు. దేశంలో నదుల అనుసంధానంకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అని, రాజశేఖర్ రెడ్డికి ఇరిగేషన్ మీద అవగాహన ఉందని, ఇరిగేషన్ మీద అవగాహన లేకపోతే ఎలా ఉంటుందో జగనన్నను చూస్తే తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి తగ్గిపోయిందని, పక్కన తెలంగాణలో వరి ఉత్పత్తి పెరిగిందని చంద్రబాబు తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తెలంగాణ ఉపయోగించుకుంటోందని, ఆంధ్రప్రదేశ్‌లో సమాంతరంగా నీటి ప్రవాహం ఉన్నా వ్యవసాయం తగ్గిందన్నారు. ఒక్క వ్యవసాయంలో మాత్రమే కాదు.. మిగిలిన అన్ని రంగాల్లో రాష్ట్రంలో వెనకబడే పరిస్థితి వచ్చిందన్నారు. కృష్ణా, పెన్నా అనుసంధానం వల్ల ఇప్పటికే రాయలసీమ, నెల్లూరుకు నిరందించామని, కాంట్రాక్టర్లకు కాదు.. ప్రజలకు మేలు చేయాలన్నది టీడీపీ ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆనం నారాయణరెడ్డి, పీ నారాయణ, శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, బి. రామారావు, పాశం సునీల్ కుమార్, మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ నాయకులు బీద రవిచంద్ర యాదవ్, చంచల బాబు యాదవ్, పనబాక కిష్టయ్య, చేజర్ల వెంకటేశ్వర రెడ్డి పరస రత్నం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంచడంలో జంపా కృషి

విశాలాంధ్ర-విజయవాడ: బలహీనవర్గాల రక్షణ, శాస్త్రీయ విజ్ఞాన అవగాహన, కళల ద్వారా సామాజిక స్పృహ, ఉద్యమాల ద్వారా చైతన్యం పెంచడానికి జీవితాన్ని అంకితం చేసిన కార్యకర్త జంపా కృష్ణ కిషోర్ అని పలువురు వక్తలు కొనియాడారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ భవనంలో ఆదివారం జరిగిన జంపా కృష్ణ కిషోర్ (జన విజ్ఞాన వేదిక) సంస్మరణ సభలో పాల్గొని నివాళులు అర్పించారు. జంపా విజయవాడ ఫిలిం సొసైటీ ఉపాధ్యక్షుడుగా, జనచైతన్యవేదిక ఉపాధ్యక్షుడుగా, సంగమం కార్యనిర్వాహక సభ్యుడుగా, బుక్ ఫెస్టివల్ సభ్యుడుగా అనేక సేవలు అందిం చారని పేర్కొన్నారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ తరపున మనోహర నాయుడు, బెల్లపు బాబ్జీ, ప్రజాశక్తి లక్ష్మయ్య, ది ఫిలిం ఫెస్టివల్ సొసైటీ తరపున కళింగ సమతా సేవా సమితి తరపున చింతా వెంకటేశ్వర్లు, సంగమం తరపున అన్నే భాస్కరరావు, జన విజ్ఞాన వేదిక తరపున కేజే చంద్రం, జంపా కృష్ణ కిషోర్ కుమార్తె అరుణశ్రీ పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణపై

సీఎం మాట నిలబెట్టుకోవాలి

ఎస్టీయూ డిమాండ్



విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు ఎదురు చూస్తున్న పాత పెన్షన్ పునరుద్ధరణ హామీపై ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ అయ్యేంతవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఎస్టీయూ ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం ఆదివారం మైలవరం లోని పెన్షనర్స్ సమావేశపు హాలులో జిల్లా అధ్యక్షులు వి.బిక్షమయ్య అధ్యక్షతన జరిగింది. ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుగ్రహ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విక్టర్ నగేష్ పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథిగా హాజరయిన తిమ్మన్న మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఇచ్చిన ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేయాలని అన్నారు. పెన్షన్ విధానం అనేది ఉద్యోగికి సామాజిక భద్రత అని, ప్రభుత్వం కల్పించే భిక్ష కాదని, ఉద్యోగి హక్కు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. రాష్ట్రంలో సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణపై అనేక ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వం జీపీఎస్ పేరుతో కొత్త నాటకానికి తెరతీసిందని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, పంజాబ్ తదితర రాష్ట్రాలలో అమలు చేసిన విధంగానే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2003 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేసిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా 2003 నోటిఫికేషన్ ద్వారా ఎంపికై, ఆ తర్వాత 2004లో చేరిన ఉపాధ్యాయులకు, పోలీసులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం తక్షణమే వర్తింప చేయాలన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో జీవో నంబరు 117 అమలు చేయడం వల్ల ఈ సంవత్సరం నాలుగు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు వదిలి ప్రైవేటు బాట పట్టారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతి, బదిలీ పొందిన 60 వేల మంది ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని, జీతం బిల్లు సబ్మిషన్ గడువు 14వ తేదీ వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్లస్ టు పాఠశాలలకు ఇంటర్మీడియట్ బోధించడానికి పాఠ్యపుస్తకాలు తక్షణమే పంపిణీ చేయాలన్నారు. కస్తూరిబా పాఠశాలల్లో పని చేస్తున్న 3,600 మంది ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, 30 శాతం ఫిట్‌మెంట్‌తో జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషనర్ మన్మోహన్ సింగ్ ఉత్తర్వులు ఇచ్చి నెల రోజులు గడిచినప్పటికీ ఇంతవరకు ఛార్జ్ తీసుకోలేదని, కమిషన్ కాలయాపన కోసమేనా అని ప్రశ్నించారు. 12వ పీఆర్సీ నివేదిక నెల రోజుల్లోపు పూర్తి చేసి, సాంకేతిక పరిజ్ఞానంతో మార్కెట్ ధరలు, ద్రవోల్బణం దృష్టిలో ఉంచుకొని 50 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ నాయకులు బసవయ్య, కోట శ్యాంప్రసాద్, సాగర్, కిషోర్, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడ్డే కార్మికులకు రూ.10వేల జీతం

ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా జగనన్న గోరుముద్ద పథకం మారిందని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ఏపీ ప్రధాన కార్యదర్శి రమేశ్ బాబు విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రెడ్డి, అధ్యక్షుడు రాజేశ్ గౌడ్‌తో కలసి ఆదివారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని, కార్మికుల వేతనాలు రూ.10 వేలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో 90వేల మంది మహిళా కార్మికులు ఉన్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయినాగానీ మెస్ చార్జీలు పెంచకపోవడం దారుణమన్నారు. నెలకు రూ.3000 జీతానికి పనిచేసే వారు మధ్యాహ్న భోజన మహిళా కార్మికులు మాత్రమేనని చెప్పారు. మెస్ ఛార్జీలు పెంచకుండా కార్మికులపై భారం మోపడం ముఖ్యమంత్రికి తగదన్నారు. 2019 ఫిబ్రవరిలో పెంచిన వేతనాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, మెస్ చార్జీలు, వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కార్మికులు పనిచేసే చోట కనీస మౌలిక వసతులు లేవని, పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ సౌకర్యం కూడా లేదన్నారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పబోవని రాష్ట్ర ప్రభుత్వాన్ని రమేశ్ బాబు హెచ్చరించారు. సమావేశం అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శివమ్మ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజన్న, కార్యదర్శిగా భాషతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నగర కార్యదర్శి కృష్ణుడు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మిడ్ డే మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బాష, రాజన్న, శివమ్మ, రవణమ్మ పాల్గొన్నారు.

'మానవత్వం మంటగలిసిందా'...!?

పల్లవి
మనువాదం పడగకింద...
మణిపూరులో మంటపుట్టె...!
మతం పిచ్చి నెత్తి కెక్కి
హిందుత్వ మేటీగాళ్ళు...
ఊరి మీద దాడి చేసి
కొంపలను తగులబెట్టె....

పట్టపగలే నడివీదిలో
నగ్నంగా నడిపిస్తూ..
మదమెక్కిన కీచకులు
మానాలను దోసిరి...
వికృత క్రీడలకు తెరలేపసాగిరి

ఆడవాళ్ల కండ్ల ముందే....
మగవాళ్ళను సంపిరి...
మగవాళ్ళ కండ్ల ముందే...
ఆడవాళ్ల నెత్తుకెళ్లి....
అత్యాచారం జరిపిరి...!

బలుపెక్కిన కామాంధులు...
బరితెగించి పోయి నేడు...!
దేశ పరువునంతా మంటల్లోకలిపిరి
హిందుత్వ మేటీలు ఊర కుక్కలై ఉర్కి
కుకీల వర్గాన్ని ఖూనీ చేస్తూ ఉంటే...

పోలీసు బలగాలు, పాలక వర్గాల తీరు
మన్నుదిన్న పామోలే కదులకుండ ఉంటుంటే
ఎక్కడుంది రక్షణ ?ఏది మహిళకు రక్షణ?
గాయమైన సివంగివై గాండ్రించు ఓ చెల్లెమ్మ
పూలనిదేవి అడుగువై ప్రతినపూని లేవమ్మ
దేశమంతా నీకు తోడు గొడుగై నిల్చున్నదమ్మ

(మణిపూర్లో మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం జరిపిన ఘటన సందర్భంగా స్పందించి రాసిన గీతం)

-జి. చంద్రమోహన్ గౌడ్,
9866510399

సాహితి

పదచిత్రాల పోహళింపు కవిత్వానికి సింగారింపు

పువ్వుకు తావిలా, సముద్రానికి కెరటాల్లా, ఆకాశానికి నక్షత్రాల్లా పదచిత్రాల మేళవింపు కవిత్వానికి ఇంపు కలిగిస్తాయి. దాని అందాన్ని ద్విగుణీకృతం చేస్తాయి. దానిని శక్తిమంతం చేస్తాయి. అందుకే పదచిత్రాలంటే కవిత్వానికి ప్రాణం. ఆ పదచిత్రాలతో కలిసి కవిత్వం సమ్మోహనం గానం చేస్తూ పఠితలను అలరిస్తుంటుంది. పదచిత్రాల తొలకరి మబ్బులతో కవిత్వం పురివిప్పి నాట్యం చేస్తుంటుంది. పదచిత్రాల సోయగాలతో కవిత్వం ప్రపంచాన్ని సమ్మోహనపరుస్తుంటుంది. పదచిత్రాలు ఎన్నెన్నో భావాల రహస్యాల్ని పుక్కిట పట్టుకుంటాయి. ఎన్నెన్నో అందాలకు, ఆనందాలకు, ఉద్వేగాలకు అక్షరాలను తొడుగుతుంటాయి. అచ్చెరువు గొలిపే ఉపమల్నీ, అలంకారాల్నీ అవి ధరిస్తుంటాయి. ప్రకృతి పార్శ్వాలతో బాటు సామాజిక పార్శ్వాలకూ అవి సరికొత్త ద్వారాలు తెరుస్తుంటాయి. అవి కవిత్వాకాశంలో మెరుపులై మెరుస్తూ ఆలోచనల వర్షపుధారల్ని కురిపిస్తుంటాయి. పదచిత్రాలు ఆమనితో ముచ్చటించే పూల గుసగుసల్ని వినిపిస్తుంటాయి. వెన్నెలతో సరాగాలాడే కలువ ఆత్మీయ సంభాషణనూ అక్షరీకరిస్తుంటాయి. అవి చిరుగాలుల్లా భావాల మబ్బుల్ని కరిగిస్తూ పచ్చదనాల అనుభూతులతో హృదయోద్యానాల్ని మురిపిస్తుంటాయి. అవి సామాజిక సంఘర్షణలోని ఎన్నో పార్శ్వాలకు ప్రతిరూపాలైపోతుంటాయి. సైనికుల కవాతులా పదచిత్రాల అడుగులతో కవిత్వం ముందుకు సాగిపోతూవుంటుంది.

'హాయిగా గొంతు ముడివిప్పి పాడు
రయిక ముడివిప్పి/ చంటిబిడ్డకు/ చన్నిచ్చే తల్లిలా
నీ అంతరాత్మలో/ నీ రక్తసంధ్యలో/ లేచిన తెల్లటి పావురాన్ని
నా రక్తసంధ్యలో/ వాలనీ/ వెలిగే పగళ్లలో
ఉభయ సంధ్యల్ని/ కలవనీ
ఎగిరి ఎగిరి అలసిపోయి/ దివాలు రెక్కలు ముడిచేవేళ
పాట నావలో కూచుని/ నీ కనురెప్పల తెరచాపనెత్తి
నీ కళ్లలో/ అస్తమానం/ అస్తమించే
నల్లని సూర్యబింబంకేసి/ సాగిపోనీ'

('పాటకత్తెకి' ఖండిక నుంచి)

అంటూ ఒక పాటకత్తెను గానం చేయమని అర్థిస్తూ, ఆ పాటను ఆలపించవలసిన విధానాన్నీ, దానిని తాను ఆలకించే విధానాన్నీ పలు విలక్షణ ప్రకృతి పదచిత్రాలతో వర్ణిస్తాడు ఎన్నెన్నో ప్రకృతి ప్రతీకలతో సరాగాలాడుకున్న చెట్టుకవి

ఇస్మాయిల్. పాటకత్తె గొంతుముడి విప్పడాన్ని రయిక ముడి విప్పడంతో అనుసంధానించడం ఇక్కడి విలక్షణత. ఆ వెంటనే మాతృత్వ భావన పురివిప్పేలా చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఒక పాటకత్తె పాటకోసం తల్లిపాల కోసం తపించే పసివాడిలా తపిస్తాడు కవి. పాటకత్తె పాట గొప్పతనాన్ని వర్ణించడానికి ఇంతకంటే శక్తిమంతమైన ప్రతీక ఏముంటుంది !? పాటకత్తె పాటకు తెల్లటి పావురమూ, వెలిగే పగళ్లూ, రక్తసంధ్యలూ... ఇవన్నీ పదచిత్రాలైపోయి పాట స్వభావాన్ని తెలియజేస్తాయి. పాటకత్తెకు ఆపాదించిన రక్తసంధ్య ఆమె జీవన సంఘర్షణను సూచిస్తుంది. ఆ సంఘర్షణకు ప్రతీకలైన ఆమె కళ్లలోని నల్లటి సూర్యబింబాల అస్తమయాల్ని చూడడానికి కవికి ఆమెపాట నావ అయిపోయింది. ఆమె కనురెప్పలు తెరచాప అయి పోయాయి. ఆమె పాటనావలో కూర్చున్న కవి ఆమె పాటకు మైమరచి పోతూనే సూర్యాస్తమయమనే ప్రకృతి దృశ్యాన్ని ఆమె కళ్లలోని నల్లటి సూర్యబింబ అస్తమయం అనే జీవనదృశ్యానికి అను సంధానం చేస్తాడు. పదచిత్రాల్లో విలక్షణ మేళవింపు అంటే ఇదే.

'ఆకలిరెక్కలు అలసిపోయి
మనిషి లోపలియంత్రాలు ముక్కలైపోయాక
చివరి మిల్లు మూసేశారు
ఎన్నెన్ని తెగిన పోగుల్ని అతికించుకుంటూ
ఎన్నెన్ని అంతరాత్మల్ని అద్దకంగా మార్చితే
ముంబై ప్రపంచం మోహనవస్త్రమై
ఫ్యాషన్ పెరేడ్ చేసింది .....
జీతం ఘనీభవించి
కష్టం బతికిబట్టకట్టింది ఈ మిల్లులోనే కదా
ఎన్ని గుండెలు మిల్లు శబ్దాల్ని విన్పిస్తాయి
ఎన్ని నరాలు దారపు పోగులై ఉబ్బి కన్పిస్తాయి
సైరన్ విన్పించక ఎన్నో గొంతులు మూగపోయాయి
వలస పక్షులన్నీ తలోదిక్కూ ఎగిరిపోయాయి
ఆకాశాన్ని తాకే అపార్టుమెంట్లతో
రంగుచిలకై లేచి రెక్కలు దులుపుకుంటుంది
యంత్రం జీవితాన్ని నియంత్రించాక
దిక్కుతోచక అక్షరాల్ని మంత్రిస్తున్నాను
ఇప్పుడు ఎవరు శాలువా కప్పినా
మిల్లు శబ్దాలే విన్పిస్తున్నాయి

('చివరి మిల్లు' ఖండిక నుంచి)

అంటూ ప్రపంచీకరణ మిగిల్చిన ఒక చేదు విషాదాన్ని విలక్షణ సామాజిక పదచిత్రాలతో కవిత్వీకరిస్తున్నాడు వర్తమానకవి సంగెవేని రవీంద్ర. ముంబైలో చివరి బట్టల మిల్లును మూసేసిన సందర్భం ఈ పదచిత్రాలకు వస్తువైంది. యాంత్రీకరణ మనిషి లోపలి యంత్రాలన్నింటినీ ముక్కలు చేసి మానవీకరణను హరించిన వైనం ఇక్కడ కనిపిస్తుంది. ఒక బట్టలమిల్లు పూర్వవైభవాన్నీ, వర్తమాన విషాదాన్నీ బేరీజు వేస్తున్నాయీ పదచిత్రాలు. ఫ్యాషన్ పెరేడ్ కూపంలో ముంబై మోహనవస్త్రం కావడానికి తెగిపోయిన పేగుల్ని మళ్లీ మళ్లీ అతికించుకుంటూ అంతరాత్మలు అద్దకంగా మారడం, మిల్లు శబ్దాలు కార్మికుల హృదయ స్పందనల్లో సంలీనమైపోవడం, ఆ తరువాత మిల్లు ఆగిపోయి కార్మికులు వలస పక్షులైపోయి ఎగిరిపోవడం, ఆఖరికి మిల్లు నింగిని తాకే భవనాలతో రెక్కలు దులుపుకొనేరంగుల చిలకైపోవడం...ఇవన్నీ విలక్షణ పదచిత్రాలే. రెక్కలు దులుపుకోవడం కార్పొరేట్ మదాంధకారాన్ని సూచిస్తుంది. ఈ పదచిత్రాలు కార్మికులతో మిల్లుకు వున్న అనుబంధాన్ని విడమరచిచెబుతాయి. ఎన్నో జీవితాల సంఘర్షణకు సంబంధించిన విషాద రాగాలను మనకు వినిపిస్తాయి. పదచిత్రాల పోహళింపు కవిత్వంలో సౌందర్యాన్ని నింపుతుంది. విభిన్న పార్శ్వాల జీవన ఆర్తి వెలుగుల్ని ప్రసరిస్తుంది. గాఢానుభూతిని వొంపుతుంది. భావాల బిందువుల్ని కవిత్వపు సింధువు చేస్తుంది.

డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,సెల్: 9177732414

స్ఫూర్తినిచ్చే పుస్తకం

మాజీ ఎంపీ, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి

గ్రంథ సమీక్ష

కామ్రేడ్ పడాల శ్యామ్‌సుందర్‌రావు జీవితచరిత్ర తప్పక చదవలసిన పుస్తకం. డాక్టర్ గుజ్జుం సీతారాములు, డాక్టర్ పడాల సమతా రోష్నీ సంపాదకులుగా ఈ పుస్తకం ఈ మధ్యనే వెలువడింది. పడాల శ్యామ్‌సుందరరావు బర్మా కాందిశీకుల కుటుంబం నుండి అనేక కష్టాలు, ప్రమాదాలు ఎదుర్కొని, నెలల తరబడి నడిచి దారిలో కొందరు ఆప్తులను కోల్పోయి, ఆఖరకు పశ్చిమగోదావరి జిల్లాలో వారి పూర్వీకుల గ్రామం చేరుకున్నారు. వారి తాతగారు ఐచ్ఛికంగా తన స్వంత కులాన్ని వదిలేసి, దళిత మహిళను వివాహం చేసుకొని, దళితవాడలో నివసించి, దళితుడిగా మారిన సంస్కర్త. ఆయన పేరు వీరాస్వామి. ఆయన కుమారుడు రామస్వామి. రామస్వామి కుమారుడు శ్యామ్‌సుందరరావు. వీరాస్వామి బర్మాకు వలస వెళ్ళారు. తండ్రిని తిరిగి తీసుకు వచ్చేందుకు వెళ్లిన రామస్వామి కూడా బర్మాలోనే సెటిల్ అయ్యారు. భూములు, ఆస్తులు సంపాదించుకున్నాడు. ఆ కాలంలో చాలామంది తెలుగువాళ్లు, బర్మాకు వలస వెళ్లే వారు. ఒక అంచనాప్రకారం దాదాపు లక్షా యాభైవేలమంది తెలుగువారు బర్మాలో ఉండేవారు.

1947లో బర్మావారు భారతీయులందర్నీ కట్టుబట్టలతో వెళ్లగొడితే, రామస్వామి, శ్యామ్ సుందరరావు మరొక పదిమంది పనివారితో బర్మా నుండి బయలుదేరి అడవుల నుండి నడిచి, దారిలో పది మందిని కోల్పోయి, తండ్రి కొడుకు ఆరు నెలలకు నర్సాపురం చేరుకున్నారు. భయంకరమైన ప్రయాణం. 14 సంవత్సరాల వయసున్న శ్యామ్‌సుందర్ రావుకు బర్మీస్, ఇంగ్లీషు తప్ప వేరే భాషలు రావు. పాఠశాలలో తెలుగుభాష రానందున ప్రవేశం లేదు. పశువులు కాసి జీవనం కొనసాగించారు. తర్వాత ఆల్లు రామలింగయ్య ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలిలో చేరి, కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

పార్టీ నిషేధానికి గురైనప్పుడు రహస్య జీవితం గడిపారు. అనేక ప్రమాదాలు ఎదుర్కొన్నారు. పార్టీని విస్తృతం చేసాడు. అతి చిన్న వయసులో 24 సంవత్సరాల వయసులో పార్టీ తరఫున ఎం.ఎల్.ఎ.గా ఎన్నికయ్యారు. రెండోవసారి కూడా ఎన్నికయ్యారు. ఒక గుడిసెలో జీవితం ప్రారంభించి, ఎం.ఎల్.ఎ.గా ఐన తర్వాత ఆ తర్వాత కూడా ఆ గుడిసెలో ఉండి మరణించారు. శాసనసభలో శ్రమజీవులవాణి సమర్థవంతంగా వినిపించారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవితాంతం గడిపారు. ఆయన జీవితచరిత్ర వివరాలను సంపాదకులు చాలా కష్టపడి సేకరించారు. ఆదర్శ జీవనం ఆయనది. ఆఖరి రోజుల్లో కొన్ని అభిప్రాయ భేదాల వల్ల ఆయన పార్టీ నుండి దూరం కావటం విషాదకరం. ఐతే ఆయన ఏ ఇతర పార్టీలో చేరలేదు. తప్పక చదవలసిన పుస్తకం.

పుస్తకం కావలసినవారు డాక్టర్ సమతారోష్నిని 8333839439కు సంప్రదించవచ్చు.

బరువెక్కిన అక్షరాలు

కవిత్వం 'బిట్వీన్ ద లైన్స్' లో కూడా ఉంటుంది. కొందరు కవులు మాత్రమే పాఠకులకు కొంత వదిలేస్తారు. తాము దాచిన నిధికి గుర్తులు సూచిస్తారు. 'నిజం' పేరిట కవిత్వం రాస్తున్న జి.శ్రీరామమూర్తి అట్లాంటి కవి. పత్రికా సంపాదకులుగా పనిచేసిన సీనియర్ పాత్రికేయులు. ఇప్పటిదాకా వీరు ఎర్రమందారాలు, కళ్లు, నిప్పురు, నాలుగో పాదం, కవితా సంపుటాలను ప్రచురించారు. ఇప్పుడు 'బూడిద చెట్ల పూలు' కవితా సంపుటితో మన ముందుకు వస్తున్నారు. కవిగా 'నిజం' ఎంత గట్టివారో తెలియజెప్పే కవిత ఈ సంపుటి ప్రారంభంలోనే ఉంది. అది 'అకల'. నా దృష్టిలో ఇది 'కలకానిది విలువైనది'. 'నిజం' అపార భావుకతకు తిరుగులేని ఉదాహరణ.

'గాలిదారాలకు వేలాడుతున్న అపురూప కుసుమం/ నా నిద్ర కొలువు పీఠంపై/ ఆసీనకావాలని ఎదురు చూస్తున్నాది.'

దృశ్య శ్రవణాల మేలు కలయిక అయిన కల ఇక్కడ కుసుమమయింది. ఆ తర్వాత అదే కల 'గారాల పిట్ట' గా, 'చందభామ'గా ఇంకా అనేక అవతారాలెత్తింది. కాని కవి కోరిక వేరు. 'వీళ్లందరిని కాదని వొక ధిక్కార 'కరదీపిక' గా మారి 'కలల లోకాన్ని యేలాలని వేచి చూస్తున్నాను' అంటున్నారు. దీంతో భావుక సీమ నుండి వాస్తవిక భూమి పైకి వచ్చి తీరాలన్నది కవి ప్రతిజ్ఞ అన్నది వెల్లడయింది.

ఉత్తమ మానవుడు అంటే, సంస్కారవంతుడైన మానవుడు వ్యవస్థ నుండి సమతాభావన పునాదిగా ఉన్న పరిపాలనను కోరుకుంటాడు. కవి సంక్షేమరాజ్య నిర్మాణంలో గౌరవప్రదమైన బాధ్యతను కలిగి ఉన్నవాడు. పౌరుని ఆరోగ్యమే దేశ ఆరోగ్యమన్న అవగాహనతో ముందుకు సాగుతుంటాడు. ఈ న్యాయమైన కోరికలకు అఘాతం కలిగే పక్షంలో 'నిజం' లాంటి కవి అసహనానికి గురవుతాడు. 'ఏ చెరుకుగడ తెగి/ ఏ గానుగకు



పానకమవుతుందో' (ఏ) అన్న పాదాలలో హింస ఉంది. పానకమొకరికి పిప్పి ఒకరికి అన్న వర్గ దృష్టీ ఉంది. ఈ వైఖరే ఆ తర్వాత కవితలలో కూడా సాగుతూ వచ్చింది.

ప్రజా సంక్షేమం కోసం కృషి చేయవలసిన ప్రభుత్వాలు సిరిసంపదలను కొల్లగొట్టి. 'చట్టబద్ధ బందిపోట్లకు ధారాదత్తం' చేయాలనుకోవటం, గర్భస్థ శిశువును ముందుగానే అసహజ పద్ధతుల ద్వారా భూపతనం చేయాలని అనుకోవటంగా 'నిజం' భావిస్తున్నారు. ఈ అధికార గణం- 'మొసళ్ల ఈతకు/ నర రక్త కొలనులు కడుతున్న/ కాపాలికుల' (అకాల ప్రసవవేదన) ని తీవ్రంగా ఈసడించుకుంటున్నారు. ఈ పాదాలలోని ఆలంకారికత తీవ్రమైన మనోవేదన నుండి పుట్టింది. సంపుటిలోని 'బిక్కు బిక్కు రైళ్లు' కవితతో 'నిజం' 'ఎంటర్ ద డ్రాగన్' అంటూ కరోనా కాలంలోకి అడుగుపెడుతున్నారు. వియత్నాం యుద్ధ కాలంలో లక్షకు పైగా కవులు అమెరికాను వ్యతిరేకిస్తూ కవితలు రాశారట. ఇప్పుడీ కరోనా విలయ కాలంలో కొన్ని లక్షల మంది కవులు తమ సానుభూతిని, దుఃఖాన్ని, ఆక్రోశాన్ని ప్రకటిస్తూ కవితలు రాశారు. అట్లా కవిత్వ మాధ్యమం మానవతా మాధ్యమమై తన సహజ స్వభావాన్ని చాటుకున్నది. వందలమంది కవులు కరోనా వస్తువుగా కవితా సంపుటాలు ప్రచురించారు. వీరిలో 'నిజం' కూడా ఒకరు. ఒక అంచనా ప్రకారం 20 నుండి 25 లక్షల మంది భాగ్యహీనులు కరోనాకు బలయ్యారు. తల్లీ తండ్రీ కరోనాకు బలైపోయి చెరో బూడిదకుప్పగా కుప్పకూలిపోయిన తర్వాత వారి సంసార వృక్షం 'బూడిద చెట్ల పూలు' పూయక తప్పదు.

కరోనా సృష్టించిన మారణహోమం గూర్చిన కథనాలను 'నిజం' ప్రత్యక్ష పరోక్ష పద్ధతుల ద్వారా వ్యక్తం చేస్తూ వచ్చారు. వారి విమర్శ కూడా తీవ్ర స్థాయిలో ఉంది. 'ప్రేత గీతమాలపిస్తున్న దేశం/ పాలకుడిలో గల్లంతైన హృదయం కోసం/ స్మశానాల్లో వెతుకుతోంది' (శవజాగారణ) ఈ విమర్శ వ్యవస్థ మీద ఒక ప్రొటెస్ట్ 'ఊపిరికొసకు వేలాడుతున్న రేపటి శవాల మీది నగానట్రా/ వొలుచుకుంటున్న త్రాసుపత్రులను/ ప్రజలపరం చేయాల్సిన బాధ్యత' ప్రభుత్వం మరిచిందన్నది కవి అభియోగం. 'నిజం' కవితా ప్రస్థానం ఉద్యమ మజిలీల గుండా సాగుతూ వచ్చింది. మలుపులు తిరుగుతూ వచ్చిన జీవితానుభవ ప్రవంతి వారి కవిత్వం. ఈ దశలో తనదైన నడకను అపేక్షించటం న్యాయమే. భాష (డిక్షన్) శైలితో విడివడి ఉండలేదన్నది విజ్ఞులకు తెలియంది కాదు. 'త్రాసుపత్రులు' 'చిద్విషాదనేల' 'ఆనంద చొక్కాలు' 'అన్నాకలి' మొదలైన సమాసాలు ఏదో తమాషా కోసం సృష్టించుకున్నవి కావు. ఇవన్నీ కవి వక్రోక్తిలో భాగం. ఈ వక్రోక్తి కవి వ్యక్తిత్వాన్ని ప్రకటిస్తున్నది. ప్రతి సమాసానికి తనదైన అర్థం ఉంది. ఉదాహరణకు- త్రాసుపత్రాలు- త్రాచుపాములు నిండిన, రోగుల పట్ల విషం విరజిమ్మిన నిలయాలు. ఇంకా అధర్మ త్రాసులోని ఒక పళ్లెంలో ప్రాణాలు, మరో పళ్లెంలో రోగి నగలు ఉన్న సన్నివేశం. ఇట్లాంటి సమాన ఘటన కవి సత్యాగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. అందుకే 'స్టైల్ ఈజ్ ద మ్యాన్' అన్నారు.

'తనువు పచ్చని బంధాన్ని/ మనసుల వెన్నెల వంతెనను/ నరికి పరిమళ హత్యలు/ సాగిస్తున్నదెవరో తెలుసు' (ముండనం) ఉద్దేశపూర్వకమైన అస్పష్టతలో ఎంత లోతున్నదో అనుభవించిన వాడికి తెలుస్తుంది. కరోన మూలంగా దేశంలోని అవ్యవస్థకు సామాన్య కుటుంబం ప్రాతినిధ్యం మహించటంలోని బీభత్సం పై పంక్తుల్లో ధ్వనిస్తున్నది. 'అక్షరాల పూలబుట్ట/ మురుగు వాసన కొడుతోంది/ కొత్తవి పేర్చాలి' (ముళ్ల బుట్ట) అన్నది కవి ప్రతిజ్ఞ, సందేశం కూడా. పత్రికాసుపత్రిలో అనుక్షణిక చరిత్ర ప్రసవిస్తున్న కొంగ్రొత్త వార్తలను ఒడిసి పట్టే సీనియర్ పాత్రికేయులు 'నిజం' సమకాలీన వస్తువుకు పూయించిన సరికొత్త పూలకు స్వాగతం పలుకుదాం.

అమ్మంగి వేణుగోపాల్, సెల్: 9441054637

అరసం ఆసరాగా చందు ఆత్మకథ

అనుభవాలు అందరికీ ఉంటాయి కాని అవన్నీ జీవితానుభవాలు కానక్కరలేదు. జీవితానుభవాలే ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. వృత్తి రీత్యా భూభౌతిక శాస్త్ర ప్రొఫెసర్, ప్రవృత్తివల్ల సాహిత్యోపజీవి అయిన ఆచార్య చందు సుబ్బారావు ఇటీవల "అరసంతో అర్ధ శతాబ్ది" గ్రంథం వెలువరించారు. దీన్నే కొంత సవరించి "నా సాహిత్య ప్రయాణం" అని పునర్ముద్రించారు. ఆయన సాహిత్య కృషి అంతా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తో ముడిపడిందే. అలాగని ఈ గ్రంథంలో ఆయన అరసం చరిత్ర రాయలేదు. ఆ పేరుతో తన జీవిత పరిణామ క్రమాన్ని చెప్పారు.

చాలా మందికి పుట్టి పెరిగిన పరిస్థితికి, తరవాత వారి జీవితం రూపుదిద్దుకున్న తీరుకు సంబంధం ఉండదు. అప్పుడే పులి కడుపున మేక పిల్లలు పుడతాయి. జీవన నేపథ్యం ఏమిటి అన్న అంశం మీదే ఎవరి జీవితమైనా ఓ దరికి చేరుకుంటుంది. చందు సుబ్బారావు ప్రగతిశీల భావాలుగలవాడిగా మారడానికి పుట్టి పెరిగిన పరిస్థితి మేలు మాగాణంలా ఉపకరించింది. చందు నానమ్మ కోటమ్మ గాంధీ ఉద్యమ స్ఫూర్తితో గీతాలు రాసిన బొల్లిముంత అక్కయ్యకు చెల్లెలు. అక్కయ్య సాహిత్యాభిరుచి ఉన్నవాడు. అన్న దగ్గర్నుంచే ఆమెకూ సాహిత్యాభిరుచి అబ్బింది. చందు తండ్రి వెంకటకృష్ణయ్య ఉపాధ్యాయుడు. తండ్రి, నాయనమ్మ తెల్లవారుఝామునసే లేచి పద్యాలు పాడే వారు. చందు మేనమామ బొల్లిముంత శివరామకృష్ణ అప్పటికే కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్నారు. బాబాయిలూ ప్రగతిశీల సాహిత్యాభిమానులే. బొల్లిముంతకు అన్న వరసయ్యే వ్యక్తి కుమారుడు బొల్లిముంత నాగేశ్వరరావు చందుకు సహాధ్యాయి. చందు తండ్రి పిల్లలకోసం పండగలు చేయించే వారు కాని దేవుడిమీద విశ్వాసం ఉన్నట్టు కనిపించదు. తిరుపతి వెళ్లి దైవ దర్శనం చేసుకున్నా దేవుడికి నమస్కరించలేదు. చందు తల్లికి మాత్రం భక్తి గట్రా ఉండేవి.

ఈ సాహిత్య, రాజకీయ వాతావరణమంతా చందును అభ్యుదయ సాహిత్యం వేపు, వామపక్ష రాజకీయాల వేపు లాక్కెళ్లింది. బెజవాడ లయొలా కళాశాలలో బి.ఎస్సీ, చదువుతున్నప్పుడు చందు మొదట్లో ఉన్నది వాళ్లమ్మకు సోదరుడి వరసయ్యే శ్రీ రామమూర్తి ఇంట్లోనే. శ్రీ రామమూర్తి సోదరులందరూ కారు డ్రైవర్లు, కండక్టర్లు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులే. అక్కడ వినిపించినవన్నీ తమ్మిన పోత రాజు, సుందరయ్య, చంద్ర రాజేశ్వర రావు, వేములపల్లి శ్రీకృష్ణ, మోటూరి హనుమంతరావు లాంటి అనేకానేక మంది కమ్యూనిస్టుల పేర్లే. సహజంగానే చందు ఆ బాటలోనే ప్రయాణించాడు.

చిన్నప్పటి నుంచి తెలుగు మీద అభిమానం పెంచుకున్న చందు తండ్రి పట్టుదల కారణంగా సైన్సు



చదవాల్సి వచ్చింది. హాస్టల్ గదిలోంచి అమ్మాయిలను చూడడానికి ఉబలాటపడడం, సినిమాలు ఎక్కువగా చూసే అలవాటు ఉండేది. సినిమా రచయితల్లోనూ చందూని ఆకట్టుకుంది వామపక్ష భావాలు, రచనా పటిమ ఉన్న వాళ్లే. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టగానే తారసపడింది చిన్ననాటి మిత్రుడు నరసింహా రావు వామపక్షవాదే. ఎమ్మెస్సీ భూభౌతిక శాస్త్రం చదవాలని సూచించింది అతనే. విశాఖపట్నంలో చందూను ఆకర్షించిందీ పురిపండా అప్పల స్వామి, శ్రీ శ్రీ, ఆరుద్ర, తల్లావఝల శివ శంకర శాస్త్రి, పూసపాటి కృష్ణం రాజు, అల్లం శేషగిరి రావు, కాళీ పట్నం రామారావువంటి వారే. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంతకు ముందున్న మహామహుల పేర్లూ చందూను ఉత్సాహ పరిచినవే. "విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు" నినాదాలే చందూ చెవిన పడ్డాయి. అందుకే "విశాఖ నగరం బంగాళాఖాతం చిలికిన నవ్వు...తూర్పు కోస్తా సిగలో పువ్వు" అనుకోగలిగాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో చందూని ఎక్కువగా ఆకర్షించింది భూభౌతిక శాస్త్ర పాఠ్య గ్రంథాలు కావు. శ్రీ శ్రీ, ఉన్నవ లక్ష్మీ నారాయణ, ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర, బొల్లిముంత శివరామ కృష్ణ, వట్టికోట ఆళ్వార్ స్వామి, దాశరథి, మహీధర రాసిన గ్రంథాలే. అలాగని అసలు చదువును నిర్లక్ష్యం చేయలేదు. చందు అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ కృషి చేశాడు. కథలు, నవలలతో పాటు కవిత్వమూ రాశాడు. "పద చిత్రాలు లేకుండా పదాలను పేరుస్తున్నవ్...కవిత్వం మానేయటానికి ఏం తీసుకుంటావ్" అని మిత్రుడు అదృష్ట దీపక్ అడిగే సరికి కవిత్వం రాయడం మానేశాడు. చందు అరడజనుకు పైగా నవలికలు రాశారు. ఇవన్నీ "విద్యార్థుల, నవదంపతుల ప్రేమ కథలే. లెఫ్టిస్ట్ టింజ్ ఉండవచ్చును. అది సరిపోదు" అని తానే అంగీకరించాడు. సాహిత్య విమర్శా రంగంలోనూ చందు కృషి ఉంది. అనేక మంది సాహిత్యం మీద తాను చేసిన వ్యాఖ్యలు ఎలా వాళ్లని నొప్పించి, తనను ఇబ్బంది పెట్టాయో కూడా దాచుకోకుండా చెప్పాడు.

సాహిత్య విమర్శ మీద చందూకు అవగాహన ఉంది. విమర్శ అంటే తిట్టిపోయడం, ఖండించడం, దోషాలు చూపించడం మాత్రమే కాదని తెలిసిన వాడే. "విమర్శ పరామర్శ కాదు. నిజమే సమీక్ష కాదు...పొగడ్త కాదు. రచయిత కీర్తిని గణించడం కాదు" అన్న జ్ఞానం ఉన్న వాడే. "...అనవలసిన మాట గట్టిగా అనవచ్చును. దుర్బుద్ధితో గాని వ్యక్తిగత కోపాలతో గాని అనకూడదు. ఈర్ష్యా ద్వేషాలతో విశ్లేషణ పనికి రాదు. అకారణంగా ప్రశంసిస్తే ఆ రచయిత ఒక్కడే సంతోషిస్తాడు. మిగతా వాళ్లు భజన కంపెనీ అనుకుంటారు. పరులను నొప్పింపక తానొవ్వక రాస్తూ పోతే మిగిలేది బూడిద...కనక "చిత్తశుద్ధీ.. త్రాసులో తూకం" ఒక్కటే సూత్రంగా భావించాను." అని నిర్దిష్టమైన విమర్శనా సూత్రాలను నిర్దేశించుకోగలిగిన సామర్థ్యం ఉన్నవాడే. "అనవలసిన చోట గట్టిగా అనాలి లేకుంటే విమర్శ అర్థం ఏమిటి...సారస్వత వివేచన ఏమిటి

ఆర్వీరామారావ్

రైల్వేతోనే పర్యాటక రంగం అభివృద్ధి

508 రైల్వే స్టేషన్లకు మోదీ శంకుస్థాపన

న్యూఢిల్లీ: భారతీయ రైల్వేల చరిత్రలో నేడు నూతన అధ్యాయం ప్రారంభమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్య సాధన దిశగా దూసుకెళ్తున్న భారత్ అమృత కాలం ప్రారంభంలో ఉందని చెప్పారు. భారత్‌కు నూతన శక్తి, నూతన ప్రేరణ, నూతన సంకల్పాలు ఉన్నాయని తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 508 రైల్వే స్టేషన్ల పునరభివృద్ధికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం మోదీ మాట్లాడారు. ప్రపంచం భారత దేశం వైపు రెండు కారణాల వల్ల చూస్తోందని మోదీ చెప్పారు. అందులో మొదటిది...30 ఏళ్ల తర్వాత ప్రజలు పరిపూర్ణ ఆధిక్యతతో ఓ పార్టీని ఎన్నుకోవడమని, రెండోది...సమస్యలకు శాశ్వత పరిష్కారాల కోసం ప్రభుత్వం కృషి చేస్తుండటమని తెలిపారు. ఆధునిక రైల్వే స్టేషన్ల వల్ల పర్యాటక రంగం వృద్ధి చెందుతుందని, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయన్నారు. 'ఒక స్టేషన్, ఒక ఉత్పత్తి' పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, దీనివల్ల కార్మికులు, వృత్తిపనివారు, నిపుణులకు మేలు జరుగుతుందని తెలిపారు. వీటితోపాటు ఆయా జిల్లాలకు ప్రత్యేక కీర్తి, ముద్ర వస్తాయన్నారు. రైలు ప్రయాణం అందుబాటులో ఉండటం మాత్రమే కాకుండా అది ఆనందదాయకంగా, సంతోషంగా జరిగేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రతి అమృత్ స్టేషన్ ఆ నగర ఆకాంక్షలకు, భారత దేశ ప్రాచీన వారసత్వ చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా ఉంటుందని పేర్కొన్నారు. తాము సదుద్దేశంతో కూడిన రాజకీయాలు చేస్తున్నామని, అభివృద్ధికే పెద్ద పీట వేస్తున్నామని మోదీ చెప్పుకొచ్చారు. భారత దేశ వారసత్వ ఘనతను అమృత్ స్టేషన్లు చాటుతాయన్నారు. రైల్వే మౌలిక సదుపాయాలు మరింత పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.

పనిలో పనిగా విపక్షాలపై మోదీ విమర్శలు గుప్పించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం 'ఇండియా' కూటమిగా ఏర్పడిన పార్టీలను పరోక్షంగా ప్రస్తావిస్తూ అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు భారతదేశం నుంచి వెళ్లిపోవాలని ప్రజలు కోరుకుంటున్నారని మోదీ చెప్పారు. బ్రిటీషర్లను దేశం నుంచి వెళ్లగొట్టిన 'క్విట్ ఇండియా' ఉద్యమమే దీనికి స్ఫూర్తి అని తెలిపారు. ప్రతిపక్షాలు ఏకైక సూత్రాన్ని పాటిస్తున్నాయని, 'వారు పని చేయరు, ఇతరులను పని చేయనివ్వరు' అని తెలిపారు. దేశవ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లను దాదాపు రూ.24,470 కోట్ల వ్యయంతో పునరభివృద్ధి చేస్తారు. అత్యంత శక్తిమంతమైన సిటీ సెంటర్లుగా వీటిని తీర్చిదిద్దుతారు. ఈ స్టేషన్ల పరిసరాల్లోని పట్టణాలతో సమగ్రంగా అనుసంధానం చేస్తారు. ప్రయాణికులకు సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రధాన దృష్టి పెడుతున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు ఈ పథకం అమలును పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. స్టేషన్ల డిజైన్ విషయంలో మోదీ అద్భుత సలహాలు ఇచ్చారన్నారు. ఈ పథకం కింద ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 55 చొప్పున, బీహార్‌లో 49, మహారాష్ట్రలో 44, పశ్చిమ బెంగాల్‌లో 37, ఆంధ్రప్రదేశ్‌లో 18, తెలంగాణలో 21, మధ్యప్రదేశ్‌లో 34, అసోంలో 32, ఒడిశాలో 25, పంజాబ్‌లో 22, గుజరాత్‌లో 21, జార్ఖండ్‌లో 20, తమిళనాడులో 18, హరియాణాలో 15, కర్నాటకలో 13 రైల్వే స్టేషన్లను పునరభివృద్ధి చేయబోతున్నారు. స్టేషన్ భవనాలను స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వం, వాస్తు శిల్పం వంటివాటికి అనుగుణంగా తీర్చిదిద్దుతారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 1,309 స్టేషన్లను పునరభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

2024లో బీజేపీ ఎన్‌కౌంటర్: అఖిలేశ్

లక్నో: వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్‌కౌంటర్ చేస్తారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. పీడీఏ (వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల) మద్దతుతో బీజేపీ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాల ఇండియా కూటమి వేరులతో పెకిలించివేస్తుందని నొక్కిచెప్పారు. ప్రజా సమస్యలంటే పట్టని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరిగి ఎన్నుకునే ప్రశ్నే లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో బీజేపీ పూర్తిస్థాయిలో విఫలమైందని, ధరలు, నిరుద్యోగం, అవినీతి పేట్రేగిపోయాయని తెలిపారు. కీలకాంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు అల్లర్ల వైపునకు దేశాన్ని బీజేపీ నెడుతోందని ఆరోపించారు. ప్రజలు ఘర్షణ పడుతుంటుంటే తద్వార రాజకీయంగా లబ్ధి పొందాలని బీజేపీ ఆశిస్తుందని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అఖిలేశ్ దుయ్యబట్టారు. ఉత్తరప్రదేశ్‌లోనూ బీజేపీపై ప్రజల్లో ఆగ్రహం ఉందని, మరలా ఆ పార్టీకి ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. ఇండియా కూటమితో కలిసి తమ పార్టీ ముందుకెళుతోందని, కలిసి వచ్చే పార్టీలను కూటమిలోకి ఆహ్వానిస్తామని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం చేసేవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లు కాగా 2024లో దానిని ప్రజలే ఎన్‌కౌంటర్ చేస్తారని అఖిలేశ్ అన్నారు. హిందూత్వ పేరిట బీజేపీ విద్వేషాన్ని రెచ్చగొడుతూ సమాజాన్ని విభజిస్తూ రాజకీయంగా లబ్ధి పొందాలని అనుకుంటోందని, శాంతి, అభివృద్ధికి ఆ పార్టీ శత్రువని విమర్శించారు. బీజేపీ పాలిత మణిపూర్, హరియాణాలో రావణ కాష్టమే ఇందుకు ఉదాహరణలన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు బీజేపీని తిరిగి అధికారంలోకి రాకుండా చేయడం అనివార్యమని అఖిలేశ్ చెప్పారు. బీజేపీ అనుసరించే హిందూత్వ కాదు నిజమైన హిందూత్వను పరిరక్షించుకోవడం హిందుస్తానీల బాధ్యతన్నారు. సామాజిక విభజన, అధికారాన్ని కైవసం చేసుకోవడమే బీజేపీ హిందూత్వ కాగా మహిళలను గౌరవించడం, వివక్షను రూపుమాపడం, ప్రేమాభిమానాలను పెంపొందించడం, సహనాన్ని ప్రోత్సహించడం, 'గంగా-జమునీ తెహజీబ్' (హిందూ, ముస్లింల సాంస్కృతిక కలయిక)ను వ్యాప్తి చేయడం, ప్రపంచం మొత్తం వసుధైవ కుటుంబం' అనేది నిజమైన హిందూత్వమని తెలిపారు. తామెప్పుడు ప్రజల పక్షాన్నే ఉంటామని, వారి తరపున సమస్యలను లేవనెత్తుతామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అఖిలేశ్ తెలిపారు.

నేడు రాజ్యసభకు ఢిల్లీ బిల్లు

న్యూఢిల్లీ: గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ అఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లు-2023ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఢిల్లీ ప్రభుత్వ సీనియర్ అధికారుల నియామకాలు, బదిలీలకు సంబంధించిన అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్‌కు బదిలీ చేసే ఆర్డినెన్స్ స్థానే కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన బిల్లును విపక్ష ఎంపీల ఆందోళన మధ్య లోక్‌సభ ఇప్పటికే ఆమోదించింది. ఢిల్లీకి సంబంధించి చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని, దీనిపై ఎలాంటి అభ్యంతరాలు వచ్చినా అవి రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవేనని అమిత్‌షా లోక్‌సభలో బిల్లు ప్రవేశపెడుతూ అన్నారు. ఈ బిల్లును జులై 25న కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. రాజ్యసభలో బిల్లును వ్యతిరేకించాలని రెండు నెలలుగా కేజ్రీవాల్ విపక్ష నేతలను కలుసుకుని మద్దతు సమీకరిస్తున్నారు. ఈ ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టులోనూ ఆప్ ప్రభుత్వం సవాలు చేసింది. రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టగానే కాంగ్రెస్ సీనియర్ నేత, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి విపక్షాల తరపున చర్చ ప్రారంభించే అవకాశం ఉంది. రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టిన రోజే చర్చ ప్రారంభించి, సాయంత్రం ఓటింగ్ నిర్వహించాలని కేంద్రం ఆలోచనగా ఉంది.

రాహుల్‌ను చూస్తే కేంద్రానికి దడ

సంజయ్‌రౌత్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని చూస్తే కేంద్ర ప్రభుత్వానికి వణుకుపుడుతోందని శివసేన(ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్ ఆదివారం అన్నారు. సూరత్ కోర్టు రాహుల్ గాంధీని దోషిగా ప్రకటించిన 24 గంటల్లోనే లోక్‌సభ స్పీకర్ ఆయనపై అనర్హత వేటు వేశారని, ఇప్పుడు రాహుల్ శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చినప్పటికీ ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరించలేదని ఆక్షేపించారు. విపక్ష కూటమి 'ఇండియా' నేతలంతా సోమవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్టు చెప్పారు. 'మోదీ ఇంటిపేరు'పై రాహుల్ 2019లో చేసిన వ్యాఖ్యలపై గుజరాత్ బీజేపీ నేత వేసిన పరువునష్టం కేసుపై సూరత్ కోర్టు ఇటీవల ఆయనను దోషిగా నిర్ధారిస్తూ రెండేళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో రాహుల్ వయనాడ్ లోక్‌సభ ఎంపీ సభ్యత్వాన్ని లోక్‌సభ సెక్రటేరియట్ రద్దు చేసింది. సూరత్ కోర్టు ఆదేశాలను గుజరాత్ హైకోర్టులోనూ, అనంతరం సుప్రీంకోర్టులోనూ రాహుల్ సవాల్ చేశారు. రాహుల్‌కు విధించిన శిక్షపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే ఇచ్చింది. దీంతో రాహుల్ సభ్యత్వం పునరుద్ధరించడానికి మార్గం సుగమమైంది. అయితే ఇంతవరకూ రాహుల్ సభ్యత్వం పునరుద్ధరించే విషయంపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పు పట్టింది. సుప్రీంకోర్టు తీర్పుపై సంజయ్ రౌత్ హర్షం వ్యక్తం చేశారు. న్యాయం బతికే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సూరత్ కోర్టు రాహుల్‌ను ఎందుకు దోషిగా నిర్ధారించిందో తనకు అర్థం కావడం లేదని అన్నారు. రాహుల్‌కు విధించిన శిక్షను నిలుపుదల చేసే నిర్ణయం హైకోర్టు తీసుకుని ఉండవచ్చని, అయితే గుజరాత్‌లోని ఏ కోర్టుకు రాజ్యాంగం, న్యాయం పట్ల గౌరవం ఉన్నట్టు కనిపించడం లేదని అన్నారు. రాహుల్‌కు విధించిన శిక్షపై న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, పీఎస్ నరసింహ, సంజయ్ కుమార్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం స్టే ఇచ్చింది.

కశ్మీర్‌లో స్వేచ్ఛను దారుణంగా అణచివేశారు

చిదంబరం

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370 రద్దుతో జమ్ముకశ్మీర్‌లో శాంతి నెలకొందన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీ చిదంబరం మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు భారతదేశం అంతటా స్వేచ్ఛను అణచివేసిందని, కశ్మీర్‌లో మరింత తీవ్రంగా స్వేచ్ఛను అణచివేసిందని విమర్శించారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు జరిగి నాలుగేళ్లయిన సందర్భంగా 'ఇది చారిత్రక నిర్ణయం జమ్ముకశ్మీర్‌లో శాంతి, అభివృద్ధికి నాంది పలికింది' అంటూ కేంద్ర ప్రభుత్వం శనివారం పేర్కొంది. కాగా ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌లోని సామాన్య ప్రజలు తమ ఇష్టానుసారంగా జీవనం సాగిస్తున్నారని లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) మనోజ్ సిన్హా శ్రీనగర్‌లో అన్నారు. అయితే దీనిపై చిదంబరం ఆదివారం ట్వీట్ చేస్తూ... "ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఏర్పడిన రాష్ట్రం (ప్రస్తుతం కేంద్ర పాలిత ప్రాంతం)లో 'శాంతి'ని జమ్ముకశ్మీర్ ప్రభుత్వం, ఎల్‌జీ మాత్రమే జరుపుకుంటారు... నేను ఈ సందర్భంగా 'సమాధి శాంతి, బానిస నిశ్శబ్దం'కు వ్యతిరేకంగా హెచ్చరించిన అధ్యక్షుడు (జాన్) కెన్నెడీని కోట్ చేయాలనుకుంటున్నాను" అన్నారు. జమ్ముకశ్మీర్‌లో అంత ఘనంగా శాంతి ఉంటే, మెహబూబా ముఫ్తీని ప్రభుత్వం గృహనిర్బంధంలో ఎందుకు ఉంచింది? పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ), నేషనల్ కాన్ఫరెన్స్ కార్యాలయాలకు ఎందుకు సీలు వేసింది? అని ప్రశ్నించారు. భారతదేశం అంతటా స్వేచ్ఛను అణచివేశారని, కశ్మీర్‌లో అది దారుణంగా ఉందని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు జరిగి నాలుగేళ్లయిన సందర్భంగా బీజేపీ శనివారం శ్రీనగర్‌లో బహిరంగ సభ నిర్వహించింది. 2019లో తీసుకున్న ఈ నిర్ణయం తరువాత, కశ్మీర్ లోయలో ఎటువంటి బంద్‌లు లేవని, పరిస్థితి మెరుగుపడటంతో, కేంద్ర పాలిత ప్రాంతం అంతర్జాతీయ కార్యక్రమాలను నిర్వహించిందని, ఇందుకు రికార్డు స్థాయిలో పర్యాటకుల రద్దీనే నిదర్శనమని ఆ పార్టీ నాయకులు చెప్పారు. కేంద్రం ఆగస్టు 5, 2019న పూర్వపు జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. దానిని జమ్ముకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది.

కుకీ ఎమ్మెల్యేల్లో భయాందోళన

అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడం అనుమానమే

కోల్‌కతా: జాతుల మధ్య హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో ఆగస్టు 21 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు కుకీ వర్గానికి ఎమ్మెల్యేలు హాజరయ్యే అవకాశాలు కనిపించడం లేదు. పార్టీలకు అతీతంగా చాలామంది కుకీ వర్గ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల కోసం ఇంఫాల్ రావాలంటేనే భయపడుతున్నారని ఆ వర్గానికి చెందిన నాయకులు చెబుతున్నారు. కాగా కుకీలకు ప్రత్యేక పాలక మండళ్లను ఏర్పాటు చేయాలన్న డిమాండ్లను ఏకగ్రీవంగా తిరస్కరించేందుకు ముందుగానే అసెంబ్లీని సమావేశపర్చాలన్న మెయితీ వర్గానికి చెందిన అత్యున్నత సంస్థ 'కోకోమీ' మాత్రం... గిరిజన ఎమ్మెల్యేలు నిజంగా అసెంబ్లీకి రావాలనుకుంటే వారికి భద్రత కల్పిస్తామని పేర్కొంది. మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా, రాబోయే సమావేశానికి హాజరు కావడం నా వంతుగా సాధ్యం కాదంటూ చురచంద్‌పూర్ బీజేపీ ఎమ్మెల్యే ఎల్‌ఎం ఖౌటే అన్నారు. పీటీఐతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. హింస, ప్రత్యేక పాలన కోసం కుకీలు చేసిన డిమాండ్లపై తీర్మానం లేకపోవడం వల్ల 'కుకీ-జోమి ఎమ్మెల్యేలందరూ సెషన్‌కు హాజరు కావడం సాధ్యం కాదు' అని ఖౌటే తెలిపారు. 60 మంది సభ్యులున్న మణిపూర్ శాసనసభలో బీజేపీకి చెందిన ఏడుగురు, కుకీ పీపుల్స్ అలయన్స్‌కు చెందిన ఇద్దరు మరియు ఒక స్వతంత్రుడితో సహా 10 మంది కుకీ-జోమీ ఎమ్మెల్యేలు ఉన్నారు. కుకీ పీపుల్స్ అలయన్స్ (కేపీఏ) అధ్యక్షుడు టోంగ్‌మాంగ్ హాకిప్ కూడా పీటీఐతో మాట్లాడుతూ... 'ఇంఫాల్‌కు ఎమ్మెల్యేలు సురక్షితంగా ప్రయాణించలేరు ... థాన్లోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక బీజేపీ ఎమ్మెల్యే వుంగ్‌జాగిన్ వాల్టేపై అక్కడ దారుణంగా దాడి జరిగింది. అతను ఇప్పటికీ వైద్య సంరక్షణలో ఉన్నాడు' అన్నారు. ఎమ్మెల్యే భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకుంటేనే మాలో భయాందోళనలు తగ్గుతాయని ఆయన అన్నారు. కాగా కుకీ ఎమ్మెలలు లేకుండా గత మూడు నెలలుగా మణిపూర్‌లో 160 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడానికి దారి తీసిన జాతుల హింసపై అర్థవంతమైన చర్చ జరిగే అవకాశం లేదని విశ్లేషకులు తెలిపారు.

ఐదుగురు పోలీసులపై వేటు

మణిపూర్‌లో మే4న ఇద్దరు మహిళలపై జరిగిన దారుణానికి సంబంధించి సంబంధిత ఏరియా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జితో సహా ఐదుగురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. జులై 19న ఈ ఘటనకు సంబంధించిన వీడియో బయటకు వచ్చిన వెంటనే, తౌబల్ జిల్లాలోని నాంగ్‌పోక్ సెక్మై పోలీస్ స్టేషన్‌కు చెందిన స్టేషన్ ఇన్‌చార్జ్, మరో నలుగురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయాలని మణిపూర్ పోలీసులు నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. మెజారిటీ కమ్యూనిటీకి చెందిన కొన్ని వర్గాల ప్రజలు ప్రతిరోజూ నిరసనలు తెలుపుతున్నప్పటికీ తక్షణం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదని వారు పేర్కొన్నారు. ఆగస్టు 3న బిష్ణుపూర్‌లో ఆయుధాల లూటీకి దారితీసిన సంఘటనలపై దర్యాప్తు చేసేందుకు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అధ్వర్యంలో కాలపరిమితితో కూడిన విచారణకు రాష్ట్ర పోలీసులు ఆదేశించారని వారు తెలిపారు.

రెచ్చిపోతున్న మితవాద ప్రచార ఛానళ్లు

హరియాణాలో ముస్లిం వ్యతిరేక వీడియోల వ్యాప్తి

అటువంటివారిపై కఠినచర్యలు: ఏడీజీపీ

న్యూఢిల్లీ: మతహింస చోటుచేసుకున్న హరియాణాలో అగ్నికి ఆజ్యం పోసేలా సామాజిక మాధ్యమాల్లో మితవాద ప్రచార ఛానళ్లు చురుగ్గా వ్యవహరిస్తున్నాయని 'ఆల్ట్ న్యూస్' హెచ్చరించింది. మెవాత్ (నుహ్)లో హిందూ మహిళలను అపహరించి వేధింపులకు గురిచేసినట్లుగా పేర్కొంటూ యూట్యూబ్ ఛానళ్ల నుంచి కల్పిత వాదనలతో వీడియోలను వ్యాప్తి చేస్తున్నారని ఆల్ట్ న్యూస్ పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆల్ట్‌న్యూస్‌కు చెందిన మహ్మద్ జుబైర్ ఒక వీడియోను కూడా షేర్ చేశారు. ఇందులో అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ) మమతా సింగ్... మితవాద ప్రచార ఛానళ్లు షేర్ చేసిన వీడియోలలో చేసిన వాదనలను తీవ్రంగా ఖండించారు. 'నేను వార్తా సంస్థతో మాట్లాడుతున్నప్పుడు వీటన్నింటినీ ఇప్పటికే ఖండించాను. ఇప్పటి వరకు అత్యాచారం లేదా లైంగిక వేధింపుల ఫిర్యాదు అందలేదు' అని మమతాసింగ్ చెప్పారు. 'తప్పుదోవ పట్టించే ఫిర్యాదులను వ్యాప్తి చేసే సామాజిక మాధ్యమ ఖాతాల్ని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోబడతాయి' అని మమతా సింగ్ ఆల్ట్ న్యూస్‌కు తెలిపారు. కాగా రెచ్చగొట్టే, కల్పిత క్లెయిమ్‌లను ప్రచారం చేస్తున్న కొన్ని ఛానళ్ల పేర్లను కూడా ఆల్ట్‌న్యూస్ బయటపెట్టింది. అవి ఎ2జెడ్ న్యూస్ టీవీ, లీడింగ్ భారత్ టీవీ, హిందుస్థాన్ 9 న్యూస్. ఎ2జెడ్ న్యూస్ టీవీని నిర్వహిస్తున్న మనోజ్‌కుమార్ శర్మ మేవాత్‌కు సంబంధించిన చాలా వీడియోలను షేర్ చేశారని మహ్మద్ జుబైర్ వెల్లడించారు. సదరు ఛానళ్లు వ్యాప్తి చేసిన ప్రచారాన్ని ఓపీఇండియా.కామ్ సహా వెబ్‌సైట్లు కూడా ప్రచురించాయి. ఆగస్టు 1న నుహ్‌లో జరిగిన మత ఘర్షణల తర్వాత హరియాణాలో ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు హిందుత్వ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ముస్లింలను, వారి ఆస్తులను లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడుతున్నాయి. మరోవైపు హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం... చట్టవిరుద్ధం అంటూ 250 మంది ముస్లిం వలస కార్మికుల గుడిసెలను నేలమట్టం చేసింది. ఇటీవల జరిగిన ఘర్షణల్లో వలస కూలీలు ఉన్నారని ప్రభుత్వం పేర్కొంది.

నుహ్‌లో హోటల్ కూల్చివేత

చండీగఢ్: హరియాణాలోని నుహ్‌లో అక్రమ కట్టడాల పేరుతో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. గతవారం దుండగులు రాళ్లదాడి కోసం ఉపయోగించిన రజా సహారా హోటల్‌ను జిల్లా అధికారులు ఆదివారం బుల్డోజర్లతో కూల్చివేశారు. ఈ హోటల్‌పై నుంచే దుండగులు యాత్రపై రాళ్ల దాడికి పాల్పడినట్లు చెబుతున్నారు. మరోవైపు హోటల్ యజమాని జంషెడ్ మాత్రం అల్లర్లతో తన హోటల్‌కు సంబంధం లేదని చెప్పాడు. అల్లరి మూకలు వాడినట్లు చెబుతున్న హోటల్ మరో ప్రాంతంలో ఉందన్నాడు. శనివారం వరకు అధికారులు రెండు డజన్ల మెడికల్ షాపులను నేలమట్టం చేశారు. దీంతోపాటు ఈ ప్రాంతానికి 20 కిలోమీటర్ల దూరంలోని తౌరు వద్ద అక్రమంగా నిర్మించారంటూ పూరి గుడిసెలను తొలగించారు. ఇటీవల అల్లర్లలో పాల్గొన్న వారివిగా చెబుతున్న దుకాణాలను తాము కూల్చామని అధికారులు తెలిపారు. వీటి యజమానులు ఇప్పటికే అరెస్టులకు భయపడి పరారీలో ఉన్నారన్నారు. నుహ్‌లో కొన్నేళ్ల నుంచి ఉన్న అక్రమ నిర్మాణాలను మూడు రోజుల నుంచి అధికారులు కూలుస్తున్నారు. నుహ్‌లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను ఆగస్టు 8వ తేదీ వరకు సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కేవలం వాయిస్ కాల్స్ మాత్రమే ఈ ప్రాంతంలో పనిచేస్తాయి. విద్వేషాలు వ్యాప్తి చేస్తున్న 200 సోషల్ మీడియా పోస్టులను అధికారులు తొలగించారు. దీంతోపాటు నాలుగు ఖాతాలను మూసివేయించారు. మరో 16 ఖాతాలను సస్పెండ్ చేశారు.

లంచం తీసుకుంటూ చిక్కిన భర్త

జైపూర్ మేయర్‌పై వేటు

జైపూర్: భర్త లంచం తీసుకుంటూ పట్టుబడటంతో జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌పై రాజస్థాన్ ప్రభుత్వం వేటువేసింది. ఓ భూమి లీజ్ వ్యవహారంలో ఆమె భర్త లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. దీంతో ఆమెను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు నంబర్ 43 కార్పొరేటర్ పదవి నుంచి కూడా సస్పెండ్ చేసింది. మేయర్ మునేశ్ గుర్జార్ భర్త సుశీల్...ఓ భూమి లీజ్ వ్యవహారంలో రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. మేయర్ స్వగృహంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో మేయర్ అక్కడే ఉన్నారు.

ఆ ఇంటి నుంచి ఏసీబీ అధికారులు రూ.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. లంచం వ్యవహారంలో మేయర్ హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కేసు విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో ఆమెపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో మరో ఇద్దరిని ఏసీబీ అరెస్టు చేసి విచారిస్తోంది. ఈ ఘటనతో కాంగ్రెస్‌పై ప్రతిపక్ష బీజేపీ విరుచుకుపడింది. ఇది దోపిడీ, అబద్ధాల ప్రభుత్వమని ఆరోపించింది.

ఎన్‌సీపీలో మరో చీలిక?

అమిత్‌షాతో పాటిల్ చర్చలతో ఊహాగానాలు

ముంబై: నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)కి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని, కార్యకర్తలంతా తమ వెంటే ఉన్నారని అధినేత శరద్ పవార్ ధీమాగా చెబుతున్న క్రమంలో పార్టీలో మరో చీలిక ఏర్పడవచ్చన్న ఊహాగానాలు పెరిగాయి. పార్టీలో మరో తిరిగుబాటుకు అవకాశమున్నది విశ్వసనీయ సమాచారం. ఎన్‌సీపీ నేత జయంత్ పాటిల్ ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్నట్లు తెలిసింది. ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను పాటిల్ భేటీ కావడంతో చీలికపై ఊహాగానాలు పెరిగాయి. అమిత్‌షా, పాటిల్ మధ్య ఒప్పందంపై చర్చలు జరిగినట్టు పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. జయంత్ పాటిల్‌తో పాటే మరో సీనియర్ నేత రాజేశ్ తోపే కూడా ఎన్డీయేలో చేరాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో సాంగ్లి నుంచి తనకు ఎంపీ టికెట్, తన కుమారుడికి ఎమ్మెల్యే టికెట్‌ను పాటిల్ కోరుతున్నారు. వారు అనుకున్నట్టే జరిగితే పాటిల్‌తో పాటు రాజేశ్ కూడా మహారాష్ట్రలోని ఎన్డీయే పభుత్వంలో చేరవచ్చన్నది విశ్వసనీయ సమాచారం. అజిత్ పవార్ జూలై 2న షిండే ప్రభుత్వంలో చేరి మహారాష్ట్రకు ఉపముఖ్యమంత్రి అయ్యారు. ఆయన వెంట వెళ్లిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కేబినెట్ పదవులు దక్కించుకున్నారు. వచ్చే ఎన్నికలలో గెలిచేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం మహారాష్ట్రలోని పూనే, బారామతి, శిరూర్, మావల్ లోక్‌సభ సీట్లే లక్ష్యంగా పావులు కదుపుతోంది. పూనే జిల్లా నేతలతో అమిత్‌షా సమావేశం కూడా ఇదే క్రమంలో జరిగింది.

ఎన్‌సీపీ గుర్తుపై అజిత్ డిమాండ్ తిరస్కరించాలి

ఈసీని కోరిన శరద్ పవార్ వర్గం

న్యూఢిల్లీ: ఎన్‌సీపీలో చీలిక ఏర్పడినట్లు రుజువు చేసే విధంగా ఎన్నికల కమిషన్‌కు అజిత్ పవార్ వర్గం ఇచ్చిన పిటిషన్‌లో ఏమీ లేదని, పార్టీ గుర్తుపై వివాదం ప్రసక్తే లేదని, అందుకోసం కపట బుద్ధితో చేసే డిమాండ్‌ను నిస్సందేహంగా తిరస్కరించాలని ఈసీకి శరద్ పవార్ వర్గం సూచించింది. ఎన్‌సీపీలో రెండు వర్గాలు ఉన్నట్లు ఈసీకి అజిత్ పవార్ సమర్పించిన పిటిషన్‌లో రుజువులు లేవని పేర్కొంది. శరద్ పవార్ నేతృత్వ ఎన్‌సీపీలో వివాదం ఉన్నట్లు ఈసీఐ గుర్తించలేదని తెలిపింది. జులై ఒకటో తేదీకి ముందు శరద్‌పవార్/ఎన్‌సీపీపై ఎలాంటి అభ్యంతరాన్ని అజిత్ పవార్ వ్యక్తం చేయలేదని, శరద్ పవార్‌తో లేక పార్టీలోని ఇతర నేతలతో సమావేశాన్ని ఆయన కోరలేదని ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. ఎన్‌సీపీలో రెండు వర్గాలు ఉన్నాయని చెప్పేలా జులై ఒకటో తేదీన అజిత్ పవార్ ఇచ్చిన పిటిషన్‌లో ఏమీలేదని శరద్ పవార్ వర్గం పేర్కొంది. అజిత్‌పవార్ వర్గం తమదే నిజమైన ఎన్‌సీపీ అని దావా చేస్తూ ఎన్నికల గుర్తు, పార్టీ పేరు కోసం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. జూన్ 30న పార్టీ ఏకగ్రీవంగా తీర్మానించి ఎన్‌సీపీ అధ్యక్షుడిగా అజిత్ పవార్‌ను ఎన్నుకున్నట్లు ఈసీకి తెలిపింది. అయితే అజిత్ పవార్ వర్గం వాదనను శరద్ పవార్ వర్గం పూర్తిగా తోసిపుచ్చింది. ఎన్‌సీపీ పార్టీ గుర్తు కోసం ఆయన డిమాండ్ దురుద్దేశంతో, అపరిపక్వతతో చేసినదిగా కొట్టిపారేసింది.

అన్యాయాన్ని ఐక్యంగా ప్రతిఘటిద్దాం

- అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం పిలుపు
- 27, 28 తేదీల్లో దళిత సంఘాల జాతీయ సదస్సు
- బీజేపీది మతోన్మాద అజెండా: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో దళితులపై జరుగుతున్న దురాగతాలను ఐక్యంగా ప్రతిఘటిద్దామని అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడీఆర్ఎం) పిలుపునిచ్చింది. దేశంలో దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, సామాజిక న్యాయం అనే అంశాలపై చర్చించేందుకు ఏఐడీఆర్ఎం, కేవీపీఎస్, సెంటర్ ఫర్ దళిత్ సర్వీస్ సంస్థలు సంయుక్తగా ఈనెల 27, 28 తేదీలలో హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షుడు ఎ.రామూర్తి తెలిపారు. న్యాయస్థానాల్లో రిజర్వేషన్ల అమలు కోసం అక్టోబరులో ఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జనవరి నెలంతా 'మోదీ హటావో-దేశ్ బచావో' నినాదంతో దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగిన ఏఐడీఆర్ఎం జాతీయ సమితి సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. రామూర్తి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ దళిత సంఘాల పోరాటాలకు సీపీఐ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీనిచ్చారు.ఏపీ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) దళిత, గిరిజనుల సమస్యలపై పోరాడుతుందన్నారు. మోదీ పాలనా కాలాన్ని క్లిష్టమైన దశాబ్దంగా అభివర్ణించారు. అట్టడుగు వర్గాల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. మతోన్మాద అజెండాతో 2024లో జరగబోయే ఎన్నికలకు బీజేపీ వ్యూహాలు రచిస్తోందని, అందులో భాగంగానే మణిపూర్, హరియాణా రాష్ట్రాల్లో అల్లర్లు జరుగుతున్నాయని రామకృష్ణ తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లివిల్సన్ మాట్లాడుతూ దేశజనాభా లెక్కల సేకరణలో భాగంగానే కుల గణన చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీహార్ ప్రభుత్వం కులగణన చేసినట్టే దేశం మొత్తం జరగాలన్నారు. అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలంటే వారి జనాభా ఎంతో తేలాల్సిందేనని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ దాడులు, అత్యాచారాలను అరికట్టాలంటే దళిత, గిరిజనులలో చైతన్యం రావాలని అన్నారు. రామూర్తి మాట్లాడుతూ న్యాయవ్యవస్థల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉంటేనే న్యాయం జరుగుతుందని అన్నారు. ఈనెల 27, 28 తేదీలలో హైదరాబాద్‌లో జాతీయ సదస్సు జరుగుతుందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావుతో పాటు ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. న్యాయస్థానాల్లో రిజర్వేషన్ల అమలు కోసం అక్టోబరులో ఢిల్లీలో జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తామని, జనవరిలో 'మోదీ హటావో-దేశ్‌కి బచావో' నిరసనలు, ఫిబ్రవరి 5న ప్రజాప్రతినిధులకు, అధికారులకు నిరసనల కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఏఐడీఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వీఎస్ నిర్మల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిత్యం కనీసం 32 మంది హత్య, అత్యాచారాలకు గురవుతుంటే గోరక్ష నెపంతో దళితులను వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. మణిపూర్‌లో అల్లర్లను బీజేపీ ప్రభుత్వమే ప్రోత్సహించిందని ఆరోపించారు. 6,156 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైతే మహిళలను వివస్త్రను చేసి ఊరేగించిన ఘటనలో ఆరుగురిని మాత్రమే అరెస్టు చేశారంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని అన్నారు. దళితుల అభివృద్ధికి నిధుల్లో 40శాతం కోతను కేంద్రం విధించినట్లు తెలిపారు. ఉపాధి హామి పథకం కింద గతంలో రూ.1.25 లక్షలకోట్లు ఇవ్వగా ప్రస్తుతం దానిని రూ.80వేల కోట్లకు తగ్గించారని చెప్పారు. న్యాయస్థానాలతో పాటు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు జరగాలన్నారు. చుండూరులో దళితులు హత్యకు గురై 32 ఏళ్లు అవుతున్నా నిందితులకు శిక్ష పడలేదని గుర్తుచేశారు. చుండూరు మృతులకు నివాళు లర్పించారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జేవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వరుపది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చిన ఏఐడీఆర్ఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులుగా
జేఎల్ఎం గ్రేడ్-2లు

ఓబులేసు, మల్లికార్జునరెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): అవినీతి రహిత సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందని, అందులో భాగంగా నియమించిన జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను సచివాలయాలకే అప్పజెప్పి...సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి.ఓబులేసు, రాష్ట్ర అధ్యక్షుడు కె.మల్లికార్జునరెడ్డి డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్వర్యంలో ఆదివారం విజయవాడ టీచర్స్ కాలనీలో సాయి జ్యువలర్స్ కన్వెన్షన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఓబులేసు, మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ సెక్రెటరీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా జేఎల్ఎం గ్రేడ్-2లు సంఘటితమయ్యారని, ఇది శుభపరిణామమన్నారు. సచివాలయం వ్యవస్థ, విద్యుత్ వ్యవస్థ మధ్య నలిగిపోతూ మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన మూడేళ్ల 8 నెలల కాలంలో 130 మందికి పైగా విధి నిర్వహణలో విద్యుత్ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారని, మరో 300 మందికి పైగా శరీర భాగాలు కోల్పోయారని చెప్పారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించి...సెలవు రోజుల్లో కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటే...జేఎల్ఎం గ్రేడ్-2లు మాత్రం సెలవు అనే మాటే లేకుండా 24 గంటలు పనిచేయాల్సి వస్తోందని ఆరోపించారు. వారికి సచివాలయ ఉద్యోగుల తరహాలో మూలవేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, విద్యుత్ సంస్థలు ఇతర అలవెన్స్‌లు చెల్లించటం లేదని తెలిపారు. జేఎల్ఎం గ్రేడ్-2 లు 2019 అక్టోబర్ 2న సచివాలయానికి అనుబంధంగా నియమించారన్నారు. నూతన సర్వీస్ రూల్స్‌తో తక్కువ వేతనాలతో ఎక్కువ పని చేయటమే కాకుండా ఇతర అలవెన్స్‌లు కూడా కోల్పోతున్నారన్నారు. ఐదేళ్లకు ఒక ప్రమోషన్ ఇచ్చి అన్యాయానికి గురిచేస్తున్నారని, ఈ సర్వీస్ రూల్స్‌ని వెంటనే రద్దు చేయాలని ఓబులేసు, మల్లికార్జునరెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంజునాథ్ మాట్లాడుతూ జేఎల్ఎం గ్రేడ్-2 లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, సచివాలయం జాబ్ చార్ట్ ప్రకారమే విధులు నిర్వర్తించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జేఎల్ఎం గ్రేడ్-2 ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కోశాధికారి సుధీర్‌బాబు అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర నాయకులు కృపాకర్, రహీమ్, అంబేద్కర్, రామకృష్ణ, నూరుల్లా, సురేశ్, అన్వర్, త్రిపురాంతకం శ్రీనివాసులు, బిల్లు శ్రీనివాసులు, నాగరాజు, రవీంద్ర, దాదు, కటిక రమేశ్, వెంకటేశ్ నాయక్, హేముకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు: ప్రజానాట్యమండలి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజా గాయకులు గద్దర్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, చెన్నం పెంచలయ్యలు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. పాటను ప్రజా చైతన్యానికి పునాదిగా చేసుకొని సమాజంలో ముఖ్యంగా పేద వర్గాల్లో చైతన్యాన్ని నింపిన ఘనత ప్రజా గాయకుడికి దక్కుతుందన్నారు. పాటను తూటాలాగా పేల్చి ప్రజా చైతన్యానికి దుర్మార్గుల గుండెల్లో దప్పు మోగించిన గద్దర్‌కు ప్రజానాట్య మండలి రాష్ట్రశాఖ ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తోందన్నారు. గద్దర్ మృతి యావత్తు సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.

చేతి వృత్తిదారుల సంఘం సంతాపం

విప్లవ గాయకుడు గద్దర్ మృతికి చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలిపారు. దోపిడీలేని సోషలిస్టు సమాజ నిర్మాణమే లక్ష్యంగా జరిగిన వామపక్ష ఉద్యమాలకు గొంతుకగా గద్దర్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ప్రజలను చైతన్య పరిచేందుకు నిరంతరం శ్రమిం చిన గొప్ప విప్లవ కళాకారుడి మరణం వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. గద్దర్ భౌతికంగా మరణించినా ఆయన పాటలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటాయని పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను విజయవాడలోని దాసరి భవన్‌లో శాలువాతో సత్కరిస్తున్న విశాలాంధ్ర విజ్ఞానసమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, జి.కోటేశ్వరరావు, లెనిన్‌బాబు, సుబ్బారావు.



ప్రైవేటు ఉపాధ్యాయుల కోసం
రూ.10 కోట్లతో సంక్షేమ నిధి

కత్తి నరసింహారెడ్డి, ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేయాలని, సమాజంలో ప్రైవేట్ ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, యూనియన్ చీఫ్ కోఆర్డినేటర్ జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రూ.10 కోట్లతో సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమావేశం నెల్లూరులోని కొండయ్యపాలెం గేట్ వద్ద గల అంబేద్కర్ భవన్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేవీకే విశ్వమోహన్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 80 వేల పైచిలుకు ప్రైవేటు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారికి గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు లేవని, కనీస వేతనంతో పాటు సరైన పనివేళలు కల్పించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. ప్రైవేటు ఉపాధ్యాయుల శ్రమశక్తితో రాష్ట్ర విద్యా వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ...వారి భవిష్యత్ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందన్నారు. హక్కులు సాధించుకోవాలంటే సంఘటితంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల కష్టాలు అంతా ఇంతకాదని, కుటుంబ బాధ్యతను సైతం పక్కనపెట్టి స్కూల్ యాజమాన్య అభివృద్ధికి, రాష్ట్ర విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. యాజమాన్యాలు కానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ వారికి కనీస వసతుల కల్పనలో విఫలమైనట్లు ఆరోపించారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి గుంటూరు వేదిక కాబోతుందన్నారు. ఈలోగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై పదివేల కరపత్రాలతో విస్తృత ప్రచారం నిర్వహించబోతున్నామన్నారు. ప్రచారంలో ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏపీటీయూఎఫ్ నాయకులు కె.సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వి.రామరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రత్యూశ్, సుబ్బారావు, రామనాథం, అనిల్‌కుమార్, చెన్నకేశవులు, నిర్మలా శ్రీనివాసరావు, పి.లీలామోహన్, టి.గౌరీశంకర్, కె.కోదండరామిరెడ్డి, కె.ధనపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 15 మందితో రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా పి.లీలామోహన్‌ను ఎన్నుకున్నారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.